www.vishalabharati.com
epaper:vishalabharati.com

గురువారం, హైదరాబాద్
11.01.2024
సంపుటి:2 సంచిక:83

# విశాల భారతి

తెలుగు దిన పత్రిక



జనవరి 14 న కాంగ్రెస్‌పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ 'భారత్ జోడో యాత్ర న్యాయ్ యాత్ర ప్రారంభం కానున్న నేపథ్యంలో.. తన సొంత వాహనానికి యాత్రకు సంబంధించిన స్టిక్కర్ ను అంటించి మద్దతు తెలిపిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి

– విశాల భారతి, స్టేట్ బ్యూరో



# త్వరలో కొత్త విద్యుత్ పాలసీ



- రైతులకు 24 గంటలు ఉచిత కరెంట్ ఇవ్వాల్సిందే
- 'గృహజ్యోతి' కింద 200 యూనిట్ల వరకు ఫ్రీ..
- పథకం అమలుకు ప్రణాళికలు సిద్ధం చేయండి
- 2014 నుంచి ఇప్పటి వరకు విద్యుత్ లెక్కలు ఇవ్వండి
- అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం
- విద్యుత్ శాఖపై సీఎం, మంత్రులు సుదీర్ఘ సమీక్ష
- నూతన విధానంపై అసెంబ్లీలో చర్చిస్తామని వెల్లడి

"త్వరలో కొత్త పవర్ పాలసీ తీసుకొస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. బుధవారం సెక్రటేరియట్‌లో ఆ విద్యుత్ శాఖపై నిర్వహించిన సమీక్షలో ఈ నిర్ణయం తీసుకున్నారు. అసెంబ్లీలో చర్చించి సమగ్ర పాలసీ రూపొందించనున్నట్లు చెప్పారు. రైతులకు 24 గంటల ఫ్రీ కరెంట్ ఇవ్వాల్సిందేనన్నారు. ఆరు గ్యారంటీల్లో భాగంగా ప్రకటించిన 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పంపిణీకి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు.

**విశాల భారతి, స్టేట్ బ్యూరో:**
సెక్రటేరియట్ లో విద్యుత్ శాఖ అధికారులు, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబులతో సమీక్షించారు. ఈ సమావేశంలో విద్యుత్‌వినియోగం, 24 గంటలపాటు నిరంతర విద్యుత్‌సరఫరా, విద్యుత్ సంస్థల ఉత్పత్తి, కొత్తగా ఉత్పత్తి చేయడానికి తీసుకోవాల్సిన చర్యలు, ఎన్నికల్లో ఇచ్చిన గృహజ్యోతి పథకానికి 2వందల యూనిట్లను అందించడానికి తీసుకోవాల్సిన చర్యలపై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి, వివిధ విద్యుత్ కంపెనీల నుంచి విద్యుత్ కొనుగోళ్లు, రాష్ట్రంలో విద్యుత్ వినియోగం, డిస్కమ్‌ల పనితీరు, ఆర్థిక పరిస్థితిపైనా వివరాలను సీఎంకు అధికారులు వివరించారు. 2014 నుంచి ఇప్పటిదాకా విద్యుత్ కంపెనీలకు, విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) మధ్య జరిగిన ఒప్పందాలు, ఆ ఒప్పందాల్లోని అంశాలు, విద్యుత్‌కు చెల్లించిన ధరలు లాంటి వాటిపై సమగ్రంగా అధ్యయనం చేసి, పూర్తి వివరాలను అందించాలని అధికారులను రేవంత్ రెడ్డి ఆదేశించారు. 2014 నుంచి జరిగిన విద్యుత్ ఒప్పందాలకు సంబంధించిన పూర్తి వివరాలు ఇవ్వాలని సీఎం ఆదేశించారు. ఎక్కువ ధర చెల్లించడానికి గల కారణాలు తెలపాలన్నారు. ప్రస్తుతం

..మిగతా 2 లో



## త్వరలోనే సంక్షేమ రాజ్యం

- పేదరికం నుంచి ప్రతిఒక్కరూ బయటపడేలా చూస్తా
- టీడీపీ-జనసేన సునామీలో వైసీపీ కొట్టుకుపోవడం ఖాయం
- జగన్ అహంకారమే అతన్ని ముంచేసింది
- తునిలో సభలో చంద్రబాబు

..మిగతా 2 లో



## అడ్డగోలుగా మాట్లాడితే కోర్టుకీడ్చుడే

- పరువు నష్టం దావా ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు
- మధురై కోర్టుకు హాజరైన దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి
- ఫొటోలు షేర్‌చేసిన కాంగ్రెస్‌నేత మాణిక్కం ఠాగూర్
- తప్పుడు ఆరోపణలపై లీగల్‌యాక్షన్‌తప్పదని ట్వీట్

..మిగతా 2 లో



## గద్దర్ నివాసానికి భట్టి విక్రమార్క..

- డిప్యూటీ సీఎం హోదాలో తొలిసారి
- గద్దర్ సమాధి వద్ద నివాళులు.. కుటుంబ సభ్యులకు పరామర్శ
- భావోద్వేగానికి గురైన గద్దర్ సతీమణి విమల
- గద్దర్ జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలని వినతి

**విశాల భారతి, స్టేట్ బ్యూరో:**
సికింద్రాబాద్ వెంకటాపురంలోని మహాబోధి విద్యాలయం ఆవరణలో ఉన్న ప్రజా యుద్ధ నౌక గద్దర్ సమాధి దగ్గర తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క బుధవారం నివాళులు అర్పించారు. డిప్యూటీ సీఎం హోదాలో తొలిసారిగా ప్రజా యుద్ధనౌక గద్దర్ నివాసానికి వెళ్లిన ఆయన.. గద్దర్ కుటుంబ సభ్యులను పరామర్శించి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. భట్టి విక్రమార్కను చూసి గద్దర్ భార్య గుమ్మడి విమల భావోద్వేగానికి గురై కంటతడి పెట్టుకున్నారు. ఆమెను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఓదార్చారు. గద్దర్ అన్న కుటుంబానికి మేమంతా అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పొడుస్తున్న పొద్దుతో.. నడుస్తున్న కాలంతో ప్రజా ఉద్యమాన్ని అహింసాయుతంగా నడిపి ప్రజల త్యాగాలను కేంద్రానికి

..మిగతా 2 లో



హరితహారం

## జవాబుదారీతనంతో జరగాలి

- పచ్చదనం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి
- అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ
- ప్లాస్టిక్‌ను తగ్గించాలని మంత్రి సూచన

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**
రాష్ట్రవ్యాప్తంగా పచ్చదనం పెంచే కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగాలని అటవీ పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆకాంక్షించారు. హరితహారం పై ఇప్పటి దాకా జరిగిన పురోగతి, రానున్న సీజన్ కోసం తీసుకోవాల్సిన చర్యలపై బుధవారం సెక్రటేరియట్‌లో మంత్రి సమీక్షించారు. అటవీ, గ్రామీణ అభివృద్ధి, మునిసిపల్, హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ హార్టీ కల్చర్, ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. అటవీ రక్షణ, పచ్చదనం పెంపు నిరంతరాయ ప్రక్రియ అని మంత్రి తెలిపారు. లక్షిత 33

..మిగతా 2 లో

## ఆర్టీసీలో కారుణ్య నియామకాలకు ఓకే..

- **రేవంత్ సర్కార్ మరో సంచలన నిర్ణయం..**
- **813 కండక్టర్ పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్**
- **ఆదేశాలు జారీ చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్**



**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:** సంచలన నిర్ణయాలతో దూకుడు ప్రదర్శిస్తోన్న రేవంత్ సర్కార్ మరో కీలక నిర్ణయం తీసుకుంది. టీఎస్ ఆర్టీసీలో పదేళ్లుగా కారుణ్య నియామకాల కోసం ఎదురుచూస్తోన్న అభ్యర్థులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. 813 మందిని కండక్టర్లుగా తీసుకోవడానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. విధి నిర్వహణలో మరణించిన సిబ్బంది వారసులతో ఆ పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కారుణ్య నియామకాలు, మెడికల్ ఇన్‌వ్యాలిడేషన్ స్కీమ్ కింద ఉద్యోగుల జీవిత భాగస్వామి లేదా వారి పిల్లలకు ప్రత్యామ్నాయ ఉపాధిని అందించడానికి

..మిగతా 2 లో



రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్‌ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు శుభాకాంక్షలు తెలిపేందుకు 'ఇండియన్ అమెరికన్‌ఫోరం' ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో 'మీట్.. గ్రీట్' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఇరిగేషన్, సివిల్‌సప్లై శాఖ మంత్రి కెప్టెన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- విశాల భారతి, స్టేట్‌బ్యూరో

## వ్యతిరేకత స్టార్ట్

- 100 రోజులు సమయం ఇద్దామనుకున్నాం
- కానీ శ్వేతపత్రాలు, అసత్య ఆరోపణలతో కాంగ్రెస్ నిందలు పెట్టింది
- అభివృద్ధి కోసం కేసీఆర్ చెమటను ధారపోశారు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**
విధ్వంసమైన తెలంగాణను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పదేండ్ల పాలనలో వికాసం వైపు నడిపించారు. రాష్ట్రాభివృద్ధిపై ఎక్కువ దృష్టి పెట్టడం వల్లే పార్టీ శ్రేణులకు తక్కువ సమయం కేటాయించాల్సి వచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. బుధవారం వరంగల్ లోక్‌సభ నియోజకవర్గంపై తెలంగాణ భవన్‌లో నిర్వహించిన సన్నాహక సమావేశంలో కేటీఆర్ పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ఇచ్చింది 6 గ్యారెంటీలు కాదు 420 హామీలు అని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఇదే విషయాన్ని బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రజలకు గుర్తు చేస్తూనే ఉండాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి 100 రోజుల సమయం ఇద్దామనుకున్నాం. కానీ, గవర్నర్ ప్రసంగం, శ్వేత పత్రాలతో బీఆర్ఎస్ ను, కేసీఆర్ ప్రభుత్వాన్ని నిందించే ప్రయత్నం కాంగ్రెస్ పార్టీయే మొదలు పెట్టిందని కేటీఆర్ మండిపడ్డారు. ప్రజలకు ఇచ్చిన హామీల నుంచి తప్పించుకునేందుకు మా మీద అకారణంగా నిందలు వేస్తే ఊరుకునేది లేదని కేటీఆర్ హెచ్చరించారు. అందుకే అసెంబ్లీలో కాంగ్రెస్ ను గట్టిగా నిలదీశామని చెప్పారు. కాంగ్రెస్ సర్కార్ అబద్ధాలు చెప్పి తప్పించుకోవాలని చూస్తే ప్రధాన ప్రతిపక్షంగా నిలదీస్తామని కేటీఆర్ తేల్చి చెప్పారు. ప్రజలను

..మిగతా 2 లో

# త్వరలో కొత్త విద్యుత్ పాలసీ

మొదటిపేజీ తరువాయి

సరైన విధానం లేనందునే పలు సమస్యలు వచ్చాయని పేర్కొన్నారు. తక్కువ ధరకు ఇచ్చే కంపెనీల నుంచి కొనుగోలు చేయాలని సూచించారు. విద్యుత్ దుర్వినియోగం అరికట్టాలని.. నిరంతర సరఫరాకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న పవర్‌పాలసీలను స్టడీ చేయాలని, ఆ రాష్ట్రాల్లోని విద్యుత్‌పరిస్థితులు, మెరుగైన విధానం ఏ రాష్ట్రంలో ఉందో అధ్యయనం చేసి, నివేదికలను ఇవ్వాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు. అన్ని రాష్ట్రాలకంటే మెరుగైన విద్యుత్ విధానాన్ని తెలంగాణలో అమలుచేయడానికి నిపుణులతో చర్చించి, అసెంబ్లీలోనూ అన్ని రాజకీయపార్టీల ప్రజా ప్రతినిధులతో సుదీర్ఘంగా చర్చించి, సరికొత్త విద్యుత్ పాలసీని తీసుకువస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.
తెలంగాణ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇచ్చి తీరాలని స్పష్టం చేశారు. ఆరు గ్యారంటీలలో ఒకటైన గృహ జ్యోతి పథకం ద్వారా ఇంటికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రభుత్వ పరంగా విద్యుత్‌ఉత్పత్తిని పెంచడానికి, మరిన్ని విద్యుత్ సంస్థలను ఏర్పాటు చేయడానికి ఉన్న అవకాశాలను, ఇప్పటికే నిర్మాణంలో ఉన్న పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ దుర్వినియోగాన్ని అరికట్టాలని, నాణ్యతను పెంచాలని సూచించారు. విద్యుత్‌ను నిరంతరం సరఫరా చేయడంలో ఎలాంటి అవాంతరాలు రాకుండా పటిష్టంగా, ముందస్తు చర్యలను చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఫైనాన్స్ స్పెషల్ సీఎస్ రామకృష్ణారావు, ఇరిగేషన్ సెక్రటరీ రాహుల్ బొజ్జా, ట్రాన్స్ కో సీఎండీ రిజ్వీ, టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్‌అలీ ఫారూఖీ, సీఎంవో అధికారులు ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



### సీఎం రేవంత్‌రెడ్డితో అమెజాన్‌ప్రతినిధుల భేటీ

**'అమెజాన్' ప్రతినిధులు బుధవారం సెక్రటేరియట్‌లో సీఎం రేవంత్ రెడ్డి తో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో తెలంగాణలో అమెజాన్ పెట్టుబడుల గురించి వారు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, అధికారులు పాల్గొన్నారు.**

# అడ్డగోలుగా మాట్లాడితే కోర్టుకీడ్చుడే

విశాల భారతి, స్టేట్‌బ్యూరో:

పీసీసీ ప్రెసిడెంట్‌గా రేవంత్‌రెడ్డి ఎంపికపై ఆరోపణలు చేసిన ఎల్బీనగర్, హుజూరాబాద్‌బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి బుధవారం మధురై హైకోర్టుకు హాజరయ్యారు. పీసీసీ పదవిని అప్పటి కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్కం ఠాగూర్‌రేవంత్‌రెడ్డికి రూ. 500 కోట్లకు అమ్ముకున్నారంటూ సుధీర్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డి గతంలో సంచలన ఆరోపణలు చేశారు. ఈ ఆరోపణలను ఠాగూర్ ఖండించారు. ఈ కామెంట్లను సీరియస్‌గా తీసుకున్న ఆయన వీరిపై మధురై హైకోర్టులో పరువు నష్టం దావా వేశారు. కోర్టు వీరిని విచారణకు హాజరు కావాలని గతంలో సమన్లు జారీ చేసినప్పటికీ.. పట్టించుకోకపోవంతో నాన్ బెయిలబుల్ అరెస్టు వారెంట్లు జారీ చేసినట్లు తెలుస్తోంది. దీంతో విచారణ కోసం ఎమ్మెల్యేలిద్దరూ కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా కోర్టు ఆవరణలో వెయిటింగ్‌చేస్తున్న సుధీర్ రెడ్డి, కౌశిక్‌రెడ్డి ఫొటోలను మాణిక్కం ఠాగూర్‌సోషల్ మీడియా 'ఎక్స్' లో పోస్ట్‌చేశారు. తనపై వచ్చిన ప్రతి ఆరోపణపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామంటూ హెచ్చరించారు.

**ఇది సమయం మాత్రమే..**

కాగా.. మాణిక్కం ఠాగూర్ ట్వీట్ కు పాడి కౌశిక్ రెడ్డి రీట్వీట్ చేశారు. ''మాణిక్కం ఠాగూర్ జీ.. ఈ ఆరోపణలు మీ సొంత కాంగ్రెస్ పార్టీ నేతలు చేశారు. తాము వాటిని సమర్థించాం. ఏదేమైనా న్యాయం గెలుస్తుంది... చింతించకండి.! ఇది సమయం మాత్రమే.'' అంటూ రాశారు.

# గద్దర్ నివాసానికి భట్టి విక్రమార్క..

మొదటిపేజీ తరువాయి

నివేదించి అప్పటి కేంద్ర ప్రభుత్వ పెద్దమ్మ అయిన సోనియమ్మను ఒప్పించడంలో గద్దరన్నది కీలక పాత్ర అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో అగ్రభాగాన నిలిచిన ప్రజా యుద్ధనౌక, తెలంగాణ ప్రజా ఉద్యమకారుడు గద్దర్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని గద్దర్ భార్య గుమ్మడి విమల, కుమారుడు సూర్యం, కుమార్తె వెన్నెల డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు వినతిపత్రం అందించారు.

# ఆర్టీసీలో కారుణ్య నియామకాలకు ఓకే..

మొదటిపేజీ తరువాయి



వారి విద్యార్హతలను బట్టి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు. సర్కారు తీసుకున్న ఈ కీలక నిర్ణయంతో విధి నిర్వహణలో ఉండగా మరణించిన సిబ్బంది కుటుంబాలకు భారీ ఊరట లభించనుంది. హైదరాబాద్ రీజియన్ పరిధిలో 66, సికింద్రాబాద్ 126, రంగారెడ్డి 52, నల్గొండ 56, మహబూబ్‌నగర్ 83, మెదక్ 93, వరంగల్ 99, ఖమ్మం 53, అదిలాబాద్ 71, నిజామాబాద్ 69, కరీంనగర్ రీజియన్‌లో 45 పోస్టులు ఖాళీలు ఉండగా.. మొత్తంగా 813 కండక్టర్ పోస్టులను భర్తీ చేయనున్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే.. పదేండ్లుగా పెండింగ్‌లో ఉన్న కండక్టర్ నియామకాలు చేపడుతున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

**రద్దీని తగ్గించడానికి మరో 275 ఆర్టీసీ బస్సుల కొనుగోలు**

ఆర్టీసీ బలోపేతంపై ప్రభుత్వం మరింత దృష్టి సారించింది. ఇప్పటికే 80 బస్సులను ప్రారంభించుకొని ప్రజలకు అందుబాటులోకి వచ్చి ఆర్టీసీ ముందుకు వెళ్తోంది. ఈ ఏడాది జూలై నెలలోపు మరో 1000 బస్సులు రోడ్డెక్కనున్నాయని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే మహాలక్ష్మి పథకం అమలు చేశామని, ఈ పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి మంచి స్పందన వస్తోందన్నారు. ఇప్పటి వరకు దాదాపు 9 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేశారు. మహాలక్ష్మి పథకం కింద రోజురోజుకు ప్రయాణికుల సంఖ్య పెరుగుతుండడంతో బస్సులు పై పెరుగుతున్న భారాన్ని తగ్గించేందుకు జులై నెలలోపు వచ్చే 1000 బస్సులకు అదనంగా మరో 275 కొత్త బస్సుల కొనుగోలుకు ఆదేశాలు జారి చేసినట్లు మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. బస్సులో ప్రయాణం చేసే ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు చేపట్టామని మంత్రి ప్రభాకర్ పేర్కొన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గం నుంచి హైదరాబాద్ జంట నగరాలకు ఇతర ప్రాంతాలకు బస్సు నడిపించడానికి ప్రాధాన్యం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత ,సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మాజీ సర్పంచ్ కేడం లింగమూర్తి, డీ ఎం వెంకటేశ్వర్లు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

**సంక్రాతి పండుగ కోసం 4, 484 బస్సులు..**

ఇదిలా ఉంటే.. సంక్రాంతి పండుగ కోసం 4,484 బస్సులను ప్రయాణికులకు అందుబాటులో ఉంచినట్టు టీఎస్సార్టీసీ ఎండీ సజ్జనార్ తెలిపారు. ప్రయాణికుల రద్దీని బట్టి మరిన్ని బస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. స్పెషల్ బస్సుల్లో కూడా మహాలక్ష్మి పథకం కింద మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చని సజ్జనార్ తెలిపారు. ఎంజీబీఎస్ నుంచి మాత్రమే కాకుండా ఉప్పల్, ఎల్బీనగర్, జేబీఎస్ నుంచి కూడా ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు పేర్కొన్నారు. మహాలక్ష్మి పథకం వల్ల ఈసారి ఏపీకి బస్సుల సంఖ్య తగ్గించినట్టు సజ్జనార్ వెల్లడించారు.

# త్వరలోనే సంక్షేమ రాజ్యం

- **పేదరికం నుంచి ప్రతిఒక్కరూ బయటపడేలా చూస్తా**
- **టీడీపీ-జనసేన సునామీలో వైసీపీ కొట్టుకుపోవడం ఖాయం**
- **జగన్ అహంకారమే అతన్ని ముంచేసింది**
- **తునిలో సభలో చంద్రబాబు**

విశాలభారతి,ఆంధ్రప్రదేశ్:

ఆంధ్రప్రదేశ్‌లో త్వరలోనే పేదలు, రైతుల సంక్షేమ రాజ్యం వస్తుందని టీడీపీ అధినేత చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. జగన్ అహంకారమే అతన్ని ముంచేసిందని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. కాకినాడ జిల్లా తునిలో జరిగిన 'రా..కదలిరా' సభలో ఆయన మాట్లాడారు. వచ్చే 3నెలల్లో తెదేపాజనసేన సునామీలో వైకాపా కొట్టుకుపోతుందని జోస్యం చెప్పారు. ప్రజల భవిష్యత్తుకు భరోసా ఇచ్చే బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీ'ని తప్పకుండా అమలు చేస్తానని ప్రకటించారు. తెలుగు జాతి, స్వర్ణయుగం కోసం కదలిరావాలని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో త్వరలోనే పేదలు, రైతుల సంక్షేమ రాజ్యం వస్తుందని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. ఇందుకోసం తెదేపాజనసేన మహత్తర కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. జీవితంలో ఇంకెప్పుడూ జగన్ గెలిచే అవకాశం లేదన్నారు. రాష్ట్రంలో రాజకీయం మారిందని, సైకో జగన్.. ఐదు కోట్ల మంది ప్రజలకు మధ్య యుద్ధం జరుగుతోందన్నారు.
*కల్తీ మద్యంతో ఆడబిడ్డల తాళిబొట్లతో ఆడుకునే పరిస్థితి వచ్చింది. ఐదేళ్లలో ప్రజల జీవన ప్రమాణాల్లో మార్పు వచ్చిందా?మూడు నెలల్లో టీడీపీ జనసేన ప్రభుత్వం ఏర్పడుతుంది. వైసీపీని చిత్తుగా ఓడించి బంగాళాఖాతంలో కలపాలి. జగన్ రాతి యుగం పోవాలి. టీడీపీజనసేన స్వర్ణయుగం రావాలి. మీ భవిష్యత్తుకు భరోసా ఇచ్చే బాధ్యత నాది. కౌలు రైతులను ఆదుకునే బాధ్యత తీసుకుంటాను. వెనకబడిన వర్గాలకు సమర్థ నాయకత్వం ఇచ్చిన పార్టీ తెదేపా. వారి కోసం జయహో బీసీ తీసుకొచ్చాం. అన్ని వర్గాలను గౌరవించే బాధ్యత తీసుకుంటాం. సంపద సృష్టించడం తెలిసిన పార్టీ తెదేపా. తెలుగుజాతిని స్వర్ణయుగం వైపు నడిపించే బాధ్యత నాది. ప్రపంచంలో తెలుగుజాతి నంబర్ వన్‌గా ఉండాలనేదే నా సంకల్పం. పేదరికం లేని సమాజం చూడాలనే ఎన్టీఆర్ కలను సాకారం చేస్తాం. పేదరికం నుంచి ప్రతిఒక్కరూ బయటపడేలా చూస్తానని చంద్రబాబు నాయుడు తెలిపారు.



# హరితహారం జవాబుదారీతనంతో జరగాలి

మొదటిపేజీ తరువాయి

శాతం పచ్చదనం కోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని కోరారు. మొక్కలు నాటడం, నర్సరీలు, అటవీ సంబంధిత కార్యక్రమాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని వీలైనంతవరకు తగ్గించాలని మంత్రి సూచించారు. ప్రజలకు ఇంటి అవసరాలకు ఉపయోగపరమైన, అలాగే కనీస ఆదాయాన్నిచ్చే మొక్కలు పెంచేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. తెలంగాణ ప్రాంతానికి చెందినటువంటి పూలు పండ్ల జాతుల మొక్కల పంపిణీ తో పాటు, స్వచ్ఛందంగా పెంచేందుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. తమ ఆవరణలో చెట్లు నాటుకున్న వాళ్లకు కనీస ఆదాయం వచ్చేలా ప్రోత్సహించాలని తెలిపారు. అందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. చింత, సీతాఫల్, ఉసిరి, జామ, నిమ్మ, సపోటా, మునగ, కరివేపాకు లాంటి మొక్కలను పంపిణీ చేసేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి కోరారు. హరితహారం కార్యక్రమం పారదర్శకంగా పూర్తి జవాబుదారీతనంతో ఉండాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవన్నారు. గతంలో జరిగిన తప్పులను సవరించుకోవాలని తెలిపారు. ఎప్పటికప్పుడు నాటుతున్న మొక్కలు వాటి ఎదుగుదల, అలాగే చనిపోయిన మొక్కలను మార్చే విధానం అన్ని కూడా వీలైనంత త్వరగా ఆన్ లైన్ లో ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. సమీక్షా సమావేశంలో అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి వాణీ ప్రసాద్, గ్రామీణ అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, పిసిసిఎఫ్ ఆర్.ఎం. దొబ్రియాల్, సుభద్ర, కమిషనర్ హనుమంతరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### దాడినీ తీవ్రంగా ఖండించిన : కొండా సురేఖ.

**భద్రాద్రి జిల్లా ఇల్లందు ఫారెస్ట్ డివిజన్ రేంజ్ పరిధిలో ఇసుక మాఫియాను అడ్డుకునేందుకు వెళ్లిన ఫారెస్ట్ అధికారులపై ట్రాక్టర్ తో ఎక్కించి చంపడానికి చేసిన కుట్రలను అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనలో దోషులు ఎంతటి వారెవరైనా ఉపేక్షించబోమన్నారు. .కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సంబంధిత అధికారులతో మంత్రి ఫోన్ లో జరిగిన ఘటన అడిగి తెలుసుకున్నారు. ప్రజా ప్రభుత్వంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని, అదే విధంగా జరిగిన ఘటనపై పూర్తి స్థాయి విచారణకు ఆదేశించారు. అటవీ ప్రాంతంలో గతంలో జరిగిన దాడుల దృష్ట్యా అధికారులు ఎల్లపుడూ అప్రమత్తంగా ఉంటు, ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా మా దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకుంటామమని, అవసరమైతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టి తీసుకువచ్చి ఎలాంటి చర్యలు తీసుకోవాలో వాటిని త్వరలోనే వెల్లడిస్తామన్నారు.**

# వాహనదారులకు గుడ్‌న్యూస్

- **ట్రాఫిక్ చలాన్ల రాయితీ గడువు పెంపు**
- **ఈనెల 31 వరకు పొడిగింపు**
- **పోలీస్‌శాఖ ప్రకటన**

విశాలభారతి,హైదరాబాద్:

వాహనదారులకు పోలీసుశాఖ శుభవార్త చెప్పింది. పెండింగ్ ట్రాఫిక్ చలాన్ల రాయితీ గడువును ఈ నెల 31 వరకు పొడిగిస్తున్నట్లు పోలీస్‌శాఖ తెలిపింది. ఇప్పటి వరకు పెండింగ్ చలాన్ల ద్వారా ఇప్పటికే రూ .107కోట్ల ఆదాయం సమకూరింది. రాష్ట్రవ్యాప్తంగా 1.05 కోట్ల పెండింగ్ చలాన్లను వాహనదారులు చెల్లించారు. వాస్తవానికి గడువు నేటితో ముగియగా.. పెండింగ్ చలాన్ల చెల్లింపునకు స్పందన వస్తుండడంతో గడువును పొడిగించింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 3.59కోట్ల ట్రాఫిక్ చలాన్లు పెండింగ్‌లో ఉన్నాయి. అయితే, రాయితీపై పెండింగ్ చలాన్లను చెల్లించేందుకు గడువు ఇవ్వడంతో వాహనదారులు చెల్లిస్తున్నారు. అయితే, సాంకేతిక సమస్యలతో చెల్లింపుల్లో ఆలస్యమవుతుందని పోలీసు వర్గాలు తెలిపాయి. ఈ క్రమంలో నేటితో గడువును పొడిగించినట్లు పోలీస్ అధికారులు తెలిపారు. డిసెంబర్ 26 నుంచి పెండింగ్ చలాన్లు రాయితీపై చెల్లించేందుకు అవకాశం కల్పించిన విషయం తెలిసిందే. ద్విచక్ర వాహనాలు, ఆటోలకు 80శాతం రాయితీ.. ఆర్టీసీ బస్సులకు 90శాతం, ఇతర వాహనాలకు 60శాతం రాయితీ రాయితీని ప్రకటించారు. గతేడాది సైతం రాయితీపై చెల్లించేందుకు సైతం అవకాశం ఇవ్వడంతో 45 రోజుల్లోనే ఏకంగా రూ.300కోట్ల ఆదాయం సమకూరింది.



# 13 దేశాల ప్రతినిధులకు.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆతిథ్యం

- **తెలంగాణ ప్రభుత్వం ప్రాధాన్యాలను వివరించిన సీఎం**
- **మాజీ పీఎం 'ఇందిరమ్మ' స్ఫూర్తితో పనిచేస్తున్నామని వెల్లడి**

విశాల భారతి, స్టేట్‌బ్యూరో:

హైదరాబాద్‌లోని కుతుబ్ షాహీ టూంబ్ ల వద్ద 13 దేశాల ప్రతినిధులకు బుధవారం రాత్రి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆతిథ్యం ఇచ్చారు. అమెరికా, ఇరాన్, తుర్కియే, యూఏఈ, యూకే, జపాన్, థాయిలాండ్, జర్మనీ, శ్రీలంక, బంగ్లాదేశ్, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్, ఫిన్లాండ్ దేశాల ప్రతినిధులు హాజరు అయ్యారు. ఈ సందర్భంగా వారికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వాగతం పలుకుతూ తమ ప్రభుత్వం ప్రాధాన్యతలను వివరించారు. 'అభయ హస్తం' కింద అన్ని వర్గాల అభ్యున్నతికి కొత్తగా ఏర్పాటు అయిన తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తున్నట్లు తెలిపారు. స్వాతంత్ర సమర యోధులు మహాత్మా గాంధీ, జవహర్ లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్ తదితర నేతల ఆశయాలను, మాజీ ప్రధాని ఇందిరా గాంధీ స్ఫూర్తిగా తీసుకుని సమానత్వం, పారదర్శకత్వంతో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తున్నట్లు వెల్లడించారు.
ఆరు హామీలతో సంక్షేమ రాష్ట్రంగా తెలంగాణ ఆవిర్భవిస్తుందని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం సమ ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు. యువత భవిష్యత్‌కు, పారిశ్రామిక అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. పారిశ్రామిక పెట్టుబడులకు సంబంధించిన ఉన్న అవకాశాలు వినియోగించుకోవాలని ఆయా దేశాలకు విజ్ఞప్తి చేశారు. అన్ని దేశాలలో సత్సంబంధాలు కొనసాగించటానికి తమ ప్రభుత్వం చిత్త శుద్ధితో ప్రయత్నిస్తుందని తెలిపారు. తెలంగాణను పారిశ్రామికంగా అభివృద్ధి చేయుటకు ముందుకు రావాలని కోరారు. అందుకు తగిన సూచనలు చేయాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, మంత్రులు దామోదర రాజనర్సింహ, శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, జయేష్ రంజన్, హైదరాబాద్ రీజనల్ పాస్ పోర్ట్ ఆఫీసర్ స్నేహజ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# వ్యతిరేకత స్టార్ట్

మొదటిపేజీ తరువాయి

వంచించాలనుకుంటున్న కాంగ్రెస్ పార్టీకి సినిమా ఇంకా మొదలు కాలేదని, అసలు సినిమా ముందుందని హాట్ కామెంట్స్ చేశారు కేటీఆర్. నెల రోజుల్లోనే కాంగ్రెస్ పాలనపై వ్యతిరేకత మొదలైందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం.. 420 హామీల్లో ఇప్పటికే కొన్నింటిపైన తప్పించుకునే ప్రయత్నం చేస్తోందని కేటీఆర్ ఆరోపించారు. నిరుద్యోగ భృతి హామీ ఇవ్వనేలేదని అసెంబ్లీ వేదికగా భట్టి విక్రమార్క అబద్ధమాడారని మండిపడ్డారు. కాంగ్రెస్ నిజస్వరూపాన్ని వాళ్ళ 420 హామీలతోనే ఎండగట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రజలకు మంచి చేసే అనేక సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ అక్కసుతో రద్దు చేస్తోందని, వాటిపై ప్రజల్లో అసంతృప్తి నెలకొంటోందన్నారు. పేదలకు మనం అండగా ఉండాలని పార్టీ శ్రేణులకు సూచించారు కేటీఆర్. జిల్లాలు రద్దు చేస్తామని అవగాహన లేకుండా సీఎం రేవంత్ మాట్లాడుతున్నారని.. జిల్లాలు రద్దు చేస్తే ప్రజలు ఊరుకుంటారా? అని కేటీఆర్ నిలదీశారు.
''ప్రజలు మనతో ఉన్నారనే ధీమాలో ఎన్నికల దాకా ఉన్నాం. ఓరుగల్లు అంటే ఉద్యమాల వీరగడ్డ. వరంగల్ జిల్లాలోనూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండే మన నేతలు ఓడిపోయారు. ఓరుగల్లు మన జయశంకర్ సార్ పుట్టిన నేల. 2014, 2019లో వరంగల్ ఎంపీ సీటును బీఆర్ఎస్ గెలిచింది. ఈసారి కూడా వరంగల్ లో గులాబీ జెండా ఎగరాలి. ఇది 8వ పార్లమెంట్ స్థానానికి సంబంధించిన సన్నాహక సమావేశం. ఈ సమావేశాల్లో పార్టీ బలోపేతానికి ఎన్నో సూచనలు వస్తున్నాయి. పార్టీ పరంగా లోపాలు సమీక్షించుకుంటాం.
పార్లమెంటు ఎన్నికల నాటికి పార్టీని మరింత బలోపేతం చేసుకుంటాం. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను పక్కన పెట్టి.. పార్లమెంట్ ఎన్నికలపై దృష్టి పెట్టి విజయం దిశగా పనిచేద్దాం. కార్యకర్తల్లో ఉత్సాహం యధావిధిగా ఉంది. ఇదే చైతన్యంతో పార్లమెంటు ఎన్నికల్లో గట్టిగా పని చేయాలి. మనల్ని ప్రజలు పూర్తిగా తిరస్కరించలేదనే విషయం మనం గుర్తుంచుకొని ముందుకు పోదాం. కేసీఆర్ కరెంటు పరిస్థితి బాగు చేశారని చిన్న పిల్లవాడిని అడిగినా చెబుతాడు. తెలంగాణ అభివృద్ధి కోసం కేసీఆర్ తన రక్తాన్ని రంగరించారు. చెమట ధార పోశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు పేద ప్రజలను నష్టపరిచాయి. ఈ అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి" అని పార్టీ శ్రేణులకు సూచించారు కేటీఆర్.



**కాంగ్రెస్ పార్టీ నాయకురాలు వైఎస్ షర్మిల బుధవారం ఆర్ అండ్‌బీ, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. కుమారుడు వైఎస్ రాజారెడ్డి వివాహానికి కుటుంబ సమేతంగా విచ్చేసి నూతన వధూవరులను ఆశీర్వదించాలని కోరుతూ వివాహ ఆహ్వాన పత్రిక అందించారు.**

– విశాల భారతి, స్టేట్‌బ్యూరో



# నిఘా నీడలో ఉప్పల్ స్టేడియం..

- **భారత్, ఇంగ్లండ్ తొలి టెస్ట్‌కు పటిష్ట భద్రత**
- **రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు**

విశాల భారతి, స్టేట్‌బ్యూరో:

భారత్ క్రికెట్‌జట్టు ఇంగ్లండ్‌తో 5 మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ ఆడేందుకు సిద్ధమైంది. జనవరి 25 నుంచి 29 వరకు 5 రోజులపాటు ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఈ టెస్ట్ మ్యాచ్ జరగనుంది. అయితే, ఈ క్రికెట్ మ్యాచ్ నిర్వహణకు సంబంధించిన భద్రతా ఏర్పాట్లపై రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, రాచకొండ కమిషనరేట్ పరిధిలో భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య జరుగనున్న టెస్ట్ మ్యాచ్ నిర్వహణకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. సెక్యూరిటీ పరంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పటిష్టమైన భద్రతా ఏర్పాట్లతోపాటు, ప్రేక్షకులకు అసౌకర్యం కలుగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. టికెట్ల విషయంలో ఇంతకుముందు జరిగిన పొరపాట్లు లేకుండా చూడాలని, హెచ్‌సీఏ ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. మ్యాచ్ చూసేందుకు వచ్చే ప్రేక్షకుల వెహికల్స్‌కు అవసరమైన పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని సీపీ సూచించారు. అలాగే, స్టేడియం పరిసరాల్లో సీసీటీవీలను ఏర్పాటు చేయాలని తెలిపారు. టికెట్ల పంపిణీ పూర్తి పారదర్శకంగా జరిగేలా చూడాలని కోరారు.

**చైన్ స్నాచర్ ను పట్టుకున్న పోలీసులకు సీపీ అభినందన**

మహిళల మెడలో నుంచి గొలుసులు దొంగతనాలు చేస్తున్న చెవుల ప్రశాంత్ కుమార్ అనే నిందితుడిని వేగంగా పట్టుకున్న ఎల్బీనగర్ సీసీఎస్‌పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బందిని రాచకొండ సీపీ సుధీర్ బాబు అభినందించారు. నిందితుడి వద్ద నుంచి రూ. 1లక్ష నగదుతో కలిపి, మొత్తం రూ. 10 లక్షల 50 వేల విలువైన ఒక గోల్డ్ చైన్, స్విఫ్ట్ కార్, యాక్టివా బైక్ ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును తక్కువ సమయంలో ఛేదించిన ఇన్ స్పెక్టర్లు ఎన్ వెంకటేశ్వర్లు, కె సత్యనారాయణ, జి గోవర్ధన్ గిరి, ఎస్ విజయ్, జి రామ కృష్ణ, ఎస్ ఐ రవి కుమార్, హెచ్ సి తస్లీమ్ తదితరులను సీపీ అభినందించి రివార్డులు అందజేశారు.

# చామలకు సముచిత స్థానం ఇవ్వాలి

**మాజీ మహిళ మండల అధ్యక్షురాలు**
**వంగూరి కవిత వెంకన్న**



**శాలిగౌరం ,విశాలభారతి :** కాంగ్రెస్ పార్టీ రానున్న పార్లమెంటు ఎన్నికల్లో భువనగిరి పార్లమెంట్ అభ్యర్థిగా చామల కిరణ్ కుమార్ రెడ్డిని ప్రకటించాలని మాజీ మండల మహిళ అధ్యక్షురాలు శాలిగౌరారం PACC డైరెక్టర్ వంగూరి కవిత వెంకన్న బుధవారం ఓ ప్రకటనల్లో వెల్లడించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారం ఉన్నా లేకున్నా కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేయడంతో పాటు 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు తమ వంతు పాత్రను పోషించిన చామల కిరణ్ కుమార్ రెడ్డికి భువనగిరి పార్లమెంటు టికెట్ లు కేటాయిస్తే భువనగిరి పార్లమెంటు వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కలిసికట్టుగా పనిచేసే అత్యధిక మెజార్టీతో గెలిపిస్తారని కాంగ్రెస్ అధిష్టానం చామల కిరణ్ కుమార్ రెడ్డికి సముచిత స్థానం కల్పించాలన్నారు.



# పోరు గర్జనను విజయవంతం చేయాలి

**ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు**
**పాలడుగు పరుశురాం మాదిగ**

**సూర్యాపేట, విశాలభారతి:** హైదరాబాదులోని ఇందిరా పార్క్ లో ఫిబ్రవరి 29న జరిగే చలో హైదరాబాద్ ఫోర్ గర్జన సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధ్యక్షులు పాలడుగు పరుశురాములు మాదిగ కోరారు.బుధవారం జిల్లా కేంద్రంలోని సైనిక్ పూరి కాలనీలోని ఆ సంఘ కార్యాలయం ఆవరణంలో చలో హైదరాబాద్ పోరు గర్జన కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చెప్పు కుట్టే వృత్తిదారులకు నెలకు 5000 రూపాయలు పెన్షన్ ఇవ్వాలని, దళిత బంధు పథకాన్ని యధావిధిగా కొనసాగించాలని, ఎంపిక చేసిన లబ్ధిదారులకు నిధులు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గంలో మాదిగలకు సముచిత స్థానం కల్పించాలని కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణ పై స్పష్టమైన వైఖరి అవలంబించి మాదిగలకు సముచిత న్యాయం చేయాలని కోరారు. గత 30 సంవత్సరాలుగా ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ అనేక ఉద్యమాలు చేశారని గుర్తు చేశారు.రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని మున్సిపాలిటీలలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కుర్రి నాగయ్య, సూర్యాపేట టౌన్ కార్యదర్శి దగ్గుపాటి వెంకన్న, పట్టణ ఉపాధ్యక్షులు దైవ ఉపేందర్, యూత్ ఉపాధ్యక్షులు బండారి సంపత్, గోలి మహేష్, కుర్రి వాసు, విజయ్, అభిషేక్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.



# ఆర్థిక సహాయం అందజేత

**సూర్యాపేట, విశాలభారతి:** ఇటీవల శబరిమలలో మృతి చెందిన సూర్యాపేట వాసి ఉయ్యాల లింగయ్య స్వామికి అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ జాతీయ కమిటీ ఆధ్వర్యంలో వారి కుటుంబ సభ్యులకు 30 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. లింగయ్య స్వామి మృతి చెందిన విషయం సూర్యాపేట జిల్లా అధ్యక్షులు రంగు ముత్యంరాజు కేరళలో ఉన్న అయ్యప్ప ధర్మ ప్రచారం సభ జాతీయ అధ్యక్షులు అయ్యప్ప దాస్ కు తెలియపర్చారు. వారి సూచన మేరకు జాతీయ కమిటీ , రాష్ట్ర కమిటీ సభ్యుల సహకారం తో పంపిన ముప్పై వేయుల రూపాయలను బుధవారం వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. లింగయ్య స్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యలను ఓదార్చి, వారికీ అయ్యప్ప ధర్మ ప్రచార సభ ఎల్లవేళలా అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బేతోజు భాస్కరా చారి, జిల్లా అధ్యక్షులు రంగు ముత్యంరాజు, జిల్లా కమిటీ సభ్యులు మాలి లింగా రెడ్డి, సుంకాని శ్రీనివాస్ స్వామి, మొరిశెట్టి సత్యనారాయణ, మాశెట్టి నరేష్ అశోక్, శ్రవణ్, శివ శంకర్, పూజారులు హనుమా ప్రసాద్,సాయి తదితరులు పాల్గొన్నారు.



# సమస్యలు పరిష్కారానికి కృషి

**ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి**

**కోదాడ, విశాలభారతి:** విశ్రాంత ఉద్యోగులు ఎటువంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకువస్తే తప్పనిసరిగా పరిష్కరిస్తారని కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని స్థానిక పెన్షనర్స్ భవనంలో ఎమ్మెల్యేగా ఎన్నికైన సందర్భంగా ఏర్పాటుచేసిన ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడంతో పాటు కోదాడలో తాను అత్యధిక మెజారిటీతో గెలిచేందుకు విశ్రాంత ఉద్యోగులు చేసిన సహకారం మరువలేనిది అన్నారు.

పెన్షనర్లకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు తప్పనిసరిగా అమలు చేస్తామన్నారు. కోదాడలో సీనియర్ సిటిజన్స్ కొరకు వృద్ధాశ్రమం ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు రావెళ్ల సీతారామయ్య పెన్షనర్లు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను శాలువా, మెమెంటో, పూల బొకేతో ఘనంగా సన్మానించారు. అనంతరం జాతీయ పెన్షనర్ల దినోత్సవం సందర్భంగా నకార విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పెన్షనర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు రావెళ్ల సీతారామయ్య, కోదాడ యూనిట్ అసోసియేట్ ప్రెసిడెంట్ మల్లెంపల్లి వెంకటేశ్వరరావు, చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి, ముత్తవరపు పాండురంగారావు, వంగవీటి రామారావు తదితరులు పాల్గొన్నారు.

# అంతర్ పంటల సాగుతో అధిక లాభం

**జిల్లా కలెక్టర్ ఎస్ వెంకట్రావు**



**సూర్యాపేట, విశాలభారతి:** ఆయిల్ ఫామ్ లో అంతర్ పంటల సాగుతో అధిక లాభం పొందుతున్నారని జిల్లా కలెక్టర్ ఎస్ వెంకట్రావు తెలిపారు. బుధవారం సూర్యాపేట జిల్లాలోని చివ్వెంల మండలం, గుంపుల తిరుమలగిరి గ్రామంలో ఆయిల్ తోటలను కలెక్టర్ పరిశీలించారు. ఆయిల్ ఫామ్ పంటలలో అంతర పంటలుగా మిర్చి వేసిన రైతు ఎన్. రాఘవరెడ్డి తన 5 ఎకరాలలో పామాయిల్ తో పాటుగా అంతర్ పంటగా వేసిన మిర్చి పంటను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ఆరున్నర ఎకరాలలో ఆల్ఫామ్ మొక్కలను వేసిన దుబ్బాక ప్రభాకర్ రెడ్డి పొలాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఆయిల్ ఫామ్ తో పాటుగా అంతర్పంటగా కంది పంట వేసిన ప్రభాకర్ రెడ్డిని కలెక్టర్ అభినందించారు. పంట భూములలో వారు వాడుతున్న బిందు సేద్యం పరికరాలను పరిశీలించారు. ఉద్యాన శాఖ ద్వారా రైతులకు అందుతున్న పామాయిల్ తోటల సబ్సిడీ వివరాలను రైతులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. రైతులు ప్రభాకర్ రెడ్డి, రాఘవ రెడ్డి వేసిన ఆయిల్ ఫామ్ తోట ఎదుగుదల బాగుందని కలెక్టర్ సంతృప్తిని వ్యక్తం చేశారు. పామాయిల్ తోటలను సాగు చేస్తున్నందుకు కలెక్టర్ రైతులను అభినందించారు. పామాయిల్ సాగుతో పాటుగా అంతర్ పంటల ద్వారా మంచి ఆదాయం లభిస్తుందని కలెక్టర్ తెలియజేశారు. పామాయిల్ తోటలో అన్ని రకాల పంటలు అంతర పంటలుగా సాగు చేయవచ్చు అన్నారు. పామాయిల్ పంట నాలుగో సంవత్సరంలో పంట దిగుబడి వస్తుందని, ఇలాగే 30 సంవత్సరాల పాటు ఆయిల్ ఫామ్ తోటల వలన ప్రతినెల స్థిరమైన ఆదాయం వస్తుందని కలెక్టర్ తెలియజేశారు. సూర్యాపేట జిల్లాలో పతాంజలి కంపెనీ ద్వారా పామాయిల్ మొక్కల పంపిణీ జరుగుతుందని తెలిపారు. పామాయిల్ తోటలో మొదటి నాలుగు సంవత్సరాలు అంతర్ పంటలుగా మిర్చి, కూరగాయలు, వేరుశనగ, కంది ,అరటి, బొప్పాయి వంటి పంటల సాగు ద్వారా అధిక ఆదాయం పొందవచ్చు అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన పట్టు పరిశ్రమల అధికారి బి శ్రీధర్, పతాంజలి పామాయిల్ కంపెనీ డీజీఎం యాదగిరి, సూర్యాపేట ఉద్యాన ధికారి జగన్, పతాంజలి సిబ్బంది హరీష్ ,సుధాకర్, రైతులు ఎన్ రాఘవరెడ్డి , దుబ్బాక ప్రభాకర్ రెడ్డి అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



# సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి

**పాఠశాల కరస్పాండెంట్ కేశినేని శ్రీదేవి**

**కోదాడ, విశాలభారతి :** పట్టణంలోని ఎస్ ఆర్ ఎమ్ పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కేశినేని శ్రీదేవి మాట్లాడుతూ పిల్లలకు బాల్యం నుంచి పండగల విశిష్టతను సంస్కృతి సంప్రదాయాలు తెలియజేయాలని అన్నారు. ప్రస్తుత యాంత్రిక జీవనంలో మనం మన పండుగలను, సంస్కృతి సంప్రదాయాలను మర్చిపోతున్నాం అని పాఠశాలలో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం పట్ల భవిష్యత్ తరాలకు మన పండుగలు ప్రాధాన్యతను అందించిన వాళ్ళం అవుతాము అన్నారు. మూడు రోజులు జరుపుకునే సంక్రాంతి పండుగ ప్రాముఖ్యతను తెలియజేస్తూ పిల్లలతో హరిదాసు, భోగి మంటలు, పాల పొంగళ్ళు, రంగోలి, సంక్రాంతి పాటల నృత్యలతో సంబరాలు అంబరాన్ని అంటాయి. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



# డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇవ్వాలి

**భద్రాచలం, విశాలభారతి:** స్థానిక అంబేద్కర్ సెంటర్లో అర్హులైన నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం డబల్ బెడ్ రూమ్ ఇల్లు ఇంటి స్థలం ఇవ్వాలని డిమాండ్ తో మాల మహానాడు, దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేపట్టడం జరిగింది. ఈ రిలే నిరాహార దీక్షను ఉద్దేశించి మాల మహానాడు జిల్లా అధ్యక్షులు అల్లాడిపోల్ రాజ్ మాట్లాడుతూ.. భద్రాచల పట్టణంలో నిరుపేద కుటుంబాలు అనేక సంవత్సరాలుగా అద్దె ఇళ్లలో ఉంటూ జీవనాని సాగిస్తున్నారని, గత ప్రభుత్వం నిరుపేదలకు తమ సొంత ఇంటి కల నెరవేరలేదని ఈ ప్రభుత్వంలో అయినా తమ సొంత ఇంటి కల నెరవేరుతుందని ఆశతో జీవనాన్ని కొనసాగిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం నిరుపేదలను గుర్తించి వారికి సొంత ఇంటి స్థలం డబల్ బెడ్ రూమ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు , దళిత ప్రజా సంఘం జిల్లా అధ్యక్షులు అల్లాడి జయరాజ్, మహాజన మహిళా సమైఖ్య జిల్లా అధ్యక్షురాలు మేకల లత, జిల్లా నాయకులు కుమారి, కృష్ణవేణి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# ఆక్రమణపై ఉక్కుపాదం



**పినపాక, విశాలభారతి :** పినపాక మండలం, ఏడూళ్ళ బయ్యారం నుండి ఉప్పాక బ్రిడ్జ్, బయ్యారం నుండి పినపాక రహదారికి రోడ్డుకు ఆనుకుని ఉన్న వ్యాపార సముదాయాలపై మండల పంచాయతీ సిబ్బంది ఉక్కుపాదం మోపారు. రోడ్డుకు 15 అడుగుల పరిధిలోపు ఆనుకుని ఉన్న అన్ని వ్యాపార సముదాయాలను తొలగించాలని గతవారం రోజుల క్రితమే, మండల పంచాయతీ అధికారులు వ్యాపారులకు నోటీసులు జారీ చేసినప్పటికీ వ్యాపారులు పట్టించుకోకపోవడంతో మండల పంచాయతీ అధికారి, పంచాయతీ సెక్రటరీ రంగంలోకి దిగి, దగ్గరుండి రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. తక్షణమే వ్యాపారులందరూ సహకరించి, రోడ్డుకు ఆనుకుని ఉన్న అన్నీ వ్యాపార సముదాయాలు తొలగించాలనీ, లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# సమాచారం మాకు బహుమతి మీకు

**సిఐ శివప్రసాద్, ఎస్సై నాగుల్ మీరా ఖాన్**



**పినపాక , విశాలభారతి :** మావోయిస్టుల సమాచారం అందించిన వారికి పోలీసు శాఖ నుంచి మంచి బహుమతి అందజేస్తామని ఏడూళ్ళ బయ్యారం సీఐ శివప్రసాద్ తెలిపారు. బుధవారం సాయంత్రం ఏడూళ్ళ బయ్యారం పోలీసు స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో సమాచారం మాకు, బహుమతి మీకు పోస్టర్ లను ఎస్సై నాగుల్ మీరా ఖాన్ తో కలిసి పోస్టర్ లను అంటించారు. ఈ సందర్భంగా సిఐ శివప్రసాద్ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశాల మేరకు వాల్ పోస్టర్స్ అంటించినట్లు తెలిపారు. మావోయిస్టులు అభివృద్ధి నిరోధకులు అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలోని అమాయక గిరిజనులు అడ్డుపెట్టుకుని, వారిని ప్రలోభాలకు, భయభ్రాంతులకు గురి చేస్తూ, తమ ఉనికిని చాటుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, అభివృద్ధి నిరోధకులైన మావోయిస్టుల సమాచారం తెలిసిన వారు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని, వారికి తగిన బహుమానం అందజేస్తామని తెలిపారు.

# నరక ప్రాయంగా రహదారి

- నిత్యం ప్రమాదాలతో ప్రయాణికుల బేంబేలు
- రోడ్డు మరమ్మత్తులపై అధికారుల చర్యలు శూన్యం
- ఆర్ అండ్ బి, బిటిపి ఎస్ అధికారులు స్పందించాలి
- మణుగూరు మాజీ జడ్పీటీసీ పాల్వంచ దుర్గ



**మణుగూరు, విశాలభారతి :** భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ నుంచి మణుగూరు వెళ్లే ప్రధాన రహదారి గుంతలతో వాహనదారులు ప్రయాణించడానికి వీలు లేకుండా ఉందని మణుగూరు మండల మాజీ జెడ్పిటిసి పాల్వంచ దుర్గ ఆరోపించారు. ప్రధాన రహదారి నిత్యం ప్రమాదాలతో, మృత్యు ఘోషతో వాహనదారులకు నరకప్రాయంగా మారిందని ఆమె అన్నారు. మణుగూరు సింగరేణి నుండి బీటీపీఎస్ కు ప్రతిరోజూ వందలాది లారీలతో బొగ్గు రవాణా జరుగుతుందని, లారీల అధిక లోడింగ్ అధిక వేగం వల్ల ఎందరో ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. నిత్యం ఏదో ఒక పని మీద మణుగూరు వచ్చే వాహనదారులు ఈ గుంతల వల్ల ప్రమాదాలకు గురవుతున్నారన్నారు.మల్లేపల్లి నుండి బీటీపిఎస్ కు వెళ్ళే రహదారిలో నిత్యం రద్దీగా తిరిగే బొగ్గు, ఇసుక లారీల తాకిడికి పైకి లేస్తున్న దుమ్ము, దూళి కణాల వలన శ్వాస వ్యాధులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు అని అన్నారు. రోడ్డు దుస్థితిపై గత మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు కు ఎన్నిసార్లు మొర పెట్టినా ప్రయోజనం లేకుండా పోయిందాన్నారు. ఇకనైనా స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని బొగ్గు ఓవర్ లోడింగ్ ను నియంత్రించి, రహదారి మారమ్మత్తులు తక్షణమే చేపట్టి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆమె అధికారులను కోరారు.



# వాసవి క్లబ్ నూతన కార్యవర్గ ఎన్నిక

**చిట్యాల, విశాలభారతి:** వాసవి క్లబ్ చిట్యాల లెజెండ్, వాసవి వనిత క్లబ్ చిట్యాల నూతన కార్యవర్గాలను బుధవారం ఎన్నుకున్నారు. లెజెండ్ అధ్యక్షులుగా ప్రొద్దుటూరు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా మేడిశెట్టి ఉమాశంకర్ కోశాధికారిగా ఇమ్మడి వెంకటేశ్వర్లు, వనిత క్లబ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా వనమా హైమావతి, వనమా మౌనిక, కోశాధికారిగా పోలా సరిత లను ఎన్నుకున్నారు. ఈ మేరకు వారికి వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ విరెల్లి సతీష్, జోన్ చైర్మన్ గుండా శ్రీధర్ లు నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు వనమా వెంకటేశ్వర్లు, కనకదుర్గ దేవాలయ చైర్మన్ శీలా సత్యనారాయణ, వాసవీ క్లబ్ మాజీ ఆర్ సి బుస్సా శ్రీనివాస్ పాల్గొన్నారు.

# కోమరిగిరి వీరాచారికి పరామర్శ



**సూర్యాపేట, విశాలభారతి:** కోమరిగిరి వీరాచారి సతీమణి రజిత ఇటీవల అనారోగ్యంతో పరమదించడం జరిగింది. కాగా వివిధ పార్టీలకు చెందిన నాయకులు, రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు బుధవారం వీరాచారిని పరామర్శించి రజిత చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీరాచారిని పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు చిత్తలూరి కృష్ణ, డిసిసి కార్యదర్శి ఎలుగూరి వెంకటేశం, నాయకులు సారగండ్ల సైదులు, చిత్తలూరి హరీష్ తో పాటు పలువురు ఉన్నారు.




# ప్రజావేదిక నిర్వహణ

**హాజరైన అడిషనల్ డిఆర్డిఓ రవి**

**పినపాక, విశాల భారతి :** మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పనులపై బుధవారం పినపాక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో అడిషనల్ డీఆర్డీవో, ప్రిసైడింగ్ ఆఫీసర్ రవి ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఆర్డీవో రవి మాట్లాడుతూ గ్రామపంచాయతీల్లో చేపట్టిన పనుల్లో అవకతవలకు పాల్పడితే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. 14వ విడత మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక ప్రజా వేదిక కార్యక్రమంలో పంచాయతీ వారీగా వివరాలను సేకరించి అందరి ముందు చదివి వినిపిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీవో రమణారావు, ఏఎంవి అనూష, నాగ ప్రకాష్, జేక్యు సిఓ అనిల్ కుమార్, ఎంపీడీవో చంద్రశేఖర్, ఎస్ఆర్పి సుశీల, ఎస్టియం వేణు, ఏపీవో వీరభద్ర స్వామి, ప్రజా ప్రతినిధులు ఎంపీపీ గుమ్మడి గాంధీ, వైస్ ఎంపీపీ కంది సుబ్బారెడ్డి, ఎంపీటీసీ శేఖర్, సర్పంచులు మహేష్ ,నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
www.vishalabharati.com
epaper:vishalabharati.com



# అధికారులపై చర్యలు తీసుకోవాలి

**అప్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పురుషోత్తం రెడ్డి**



**శాలిగౌరారం, విశాలభారతి :** దళారులతో కుమ్మక్కై పత్తి రైతులను నిండా ముంచుతున్న సిసిఐ అధికారులపై చర్యలు తీసుకోవాలని పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు యంపల్ల పురుషోత్తం రెడ్డి కోరారు. ఈ సందర్భంగా బుధవారం అయన మాట్లాడుతూ శాలిగౌరారం మండలంలో మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో నడుస్తున్న సీసీఐ కేంద్రంలోకి పత్తిని అమ్మేందుకు వచ్చిన రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ,పత్తి మంచిగా లేదనే సాకుతో క్వింటాలుకు 5 నుండి 10 కిలోల తరుగు తీస్తూ రైతులను ఇబ్బందులకు గురించేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తరుగు పేరుతో రైతులను నిలువున దోపిడీ చేస్తున్న అధికారుల పైన చర్యలు తీసుకోని రైతులకు న్యాయం చేయాలనీ కోరారు. జిల్లాలో అత్యధిక స్థానాల్లో శాసనసభ్యులు గా ఉన్న కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు చొరవ చూపి రైతులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు.

# సూర్యాపేటకు జిల్లాకు ట్రైనీ ఐపీఎస్

**6 నెలల పాటు జిల్లాలో విధులపై శిక్షణ**



**సూర్యాపేట, విశాలభారతి:** సర్దార్ వల్లభాయ్ పటేల్ జాతీయ పోలీసు శిక్షణా కేంద్రంలో శిక్షణలో ఉన్న ట్రైనీ ఐపీఎస్ అధికారి రాజేష్ మీనా సూర్యాపేట జిల్లాలో 6 నెలల శిక్షణ నిమిత్తం బుధవారం విధులకు రిపోర్ట్ చేసినారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే ఐపిఎస్ ని జిల్లా పోలీసు కార్యాలయం నందు కలిసి విధుల్లో చేరడం జరిగినది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే ఐపిఎస్ జిల్లా భౌగోళిక స్థితిగతులు, క్రైమ్ రిపోర్టర్ గురించి వివరించారు. అనుభవాలను వివరించి శిక్షణ కాలంలో నేర్చుకోవాల్సిన అంశాలపై సూచనలు, సలహాలను అందించారు. ఈ 6 నెలల శిక్షణ కాలంలో ట్రైనీ అదికారి మండల పోలీస్ స్టేషన్లు, పట్టణ పోలీస్ స్టేషన్లు, క్షేత్ర స్థాయిలో పోలీసు విధులు, పోలీస్ అడ్మనిస్ట్రేషన్, కేసుల దర్యాప్తు, కోర్టు విధులు, క్రైమ్ రికార్డ్స్, ఇంటలిజేన్స్ విధులు, ఎస్ హెచ్ ఓ , ఎస్ డి పిఓ విధులు మొదలగు వాటిపై క్షేత్ర స్థాయిలో శిక్షణ పొందుతారు. రాజేష్ మీనా ఐపీఎస్ రాజస్తాన్ రాష్ట్రానికి చెందిన వారు, 2022 బ్యాచ్ ఐపీఎస్ అధికారి, జోద్ పూర్ ఐఐటీ నుండి కమ్యూటర్ సైన్స్ లో 2019 సం.లో ఇంజనీరింగ్ పట్టభద్రులు అయ్యారు.

# బాధితుడిని పరామర్శించిన ఎమ్మెల్యే



**రామన్నపేట, విశాలభారతి:** బోగారం గ్రామానికి చెందిన కూనూరి సాయికుమార్ గౌడ్ మామ సుర్వీ ఇస్తారి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయపడ్డారు. ఎల్బీనగర్ పవన్ సాయి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రమాద విషయాన్ని తెలుసుకున్న నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం బుధవారం బాధితున్ని ఆసుపత్రిలో పరామర్శించి ప్రస్తుత ఆరోగ్య వివరాలను హాస్పిటల్ ఎండి ఆల్లేటి శ్రీనివాస్ గౌడ్ నూ అడిగి తెలుసుకొని మెరుగ్తైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంగుల వెంకటరాజి రెడ్డి, పూస బాలకృష్ణ,మాదగోని ఆంజనేయులు, కూనురి వెంకట రమణ, గోశిక వెంకటేశ్వర్లు, కడారి అభి, రాపోలు నాగరాజు, మేడి హరి, తదితరులు పాల్గొన్నారు.



# ఫౌండేషన్ సేవలు మరువలేనివి

**కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు దొనకొండ రమేష్**

**తుంగతుర్తి, విశాలభారతి:** సమాజంలో కోమటిరెడ్డి ప్రతీక్ రెడ్డి ఫౌండేషన్ చేస్తున్న సేవలు మరువలేనివని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు దొనకొండ రమేష్ అన్నారు బుధవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ప్రతిజ్ఞ పౌండేషన్ సహకారంతో పాఠశాల విద్యార్థులకు చెద్దర్లు క్రీడా సామాగ్రిని పంపిణీ చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోమటిరెడ్డి ప్రతీక్ రెడ్డి 123 పురస్కరించుకొని గతంలో ఒక మారు పాఠశాలకు వచ్చి పాఠశాలలోని పరిస్థితిని జిల్లా మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి ఎమ్మెల్యే మందుల సామెల్ దృష్టికి తీసుకొని వెళ్లి ప్రస్తుతం విద్యార్థులకు కావలసిన చెద్దర్లు క్రీడా స్వామికి పంపిణీ చేసినట్లు తెలిపారు రానున్న రోజుల్లో పాఠశాల చుట్టూ ఫెన్సింగ్ పాఠశాలకు ఆరు సిసి కెమెరాలు , పాఠశాల గదులకు డోర్లు, పంపిణీ చేస్తామని తెలిపారు విద్యార్థులు ముఖ్యముగా చదువులో రాణించి జిల్లా ,రాష్ట్ర స్థాయిలో రాణించాలని కోరారు. రాష్ట్రస్థాయిలో రాయించిన విద్యార్థులకు లక్ష రూపాయలు జిల్లాస్థాలు వారికి 50 వేల రూపాయలు మండల స్థాయిలో రాణించిన వారికి పదివేల రూపాయలు బహుమతి ప్రధానం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ఓరుగంటి సత్యనారాయణ, కటకం వెంకటేశ్వర్లు ,కొత్తగూడెం సర్పంచ్ విజయ్ జటంగి మహేష్ ,దాచపల్లి నరేష్, అక్కినపల్లి రాములు తదితరులు పాల్గొన్నారు.



# హిట్ అండ్ రన్ జీవో ను రద్దు చేయాలి

- డ్రైవర్లకు పదేళ్ల జైలు,
- రూ. 10 లక్షల జరిమాన సరికాదు
- మాజీ ఎమ్మెల్యే రంగారెడ్డి

**మిర్యాలగూడ, విశాలభారతి:** డ్రైవర్లకు ఇబ్బందిగా మారిన హిట్ అండ్ రన్ జీవో ను రద్దు చేయాలని రైస్ మిల్స్ డీసీఎం డ్రైవర్లు బుధవారం స్థానిక ఈదురుగూడ చౌరస్తా వద్ద రాస్తారోకో చేశారు. కాగా మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి సీఐటీయూ లీడర్లు మద్దతు చెప్పారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రంగారెడ్డి మాట్లాడారు. డ్రైవర్లను ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులు పెట్టేందుకు ప్రభుత్వం కొత్త చట్టం తీసుకొచ్చిందని ఆరోపించారు. డ్రైవర్ల జీవనం కష్టతరంగా మారుతుందన్నారు.రోడ్డు ప్రమాదం జరిగితే 10 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ. 10 లక్షల జరిమాన విధించే విధంగా చట్టం చేయడం సరి కాదన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా లీడర్లు డబ్బికార్ మల్లేష్, తిరుపతి రామ్మూర్తి, యూనియన్ అధ్యక్షులు నాగటి జోసెఫ్, అనంతుల రాజేష్, పుట్టల బాబు, జాగటి సైదులు, బాబ కొరటికల్ రవి, అభినవ్ ఉన్నారు.



# ఆర్టీసీ కార్మికులకు అండగా ఉంటాం

**ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి**

**మిర్యాలగూడ, విశాలభారతి:** మహాలక్ష్మీ స్కీమ్ అమలులో ఆర్టీసీ కార్మికుల సేవలు ప్రశంసనీయమని కాంగ్రెస్ ప్రభుత్వం పక్షాన ఆర్టీసీ కార్మికులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం తెలంగాణ రాష్ట్రం రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వనభోజన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇప్పటికే మిర్యాలగూడ ఆర్టీసీ డిపో మేనేజర్ బి. పాల్ పర్యవేక్షణలో ఇక్కడి ఆర్టీసీ డిపో రాష్ట్ర వ్యాప్త గుర్తింపును సాధించిందన్నారు. ఇదే పనితీరును కొనసాగించాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం దిశగా పాలన చేస్తోందన్నారు.



# కళాశాలను తనిఖీ చేసిన డిఐఓ

**కల్వకుర్తి, విశాల భారతి:** కల్వకుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం డి ఐ ఓ వెంకటరమణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల సిలబస్ గురించి డైరీస్, అటెండెన్స్ రిజిస్టర్స్ పరిశీలించారు. జిల్లాలో ఉత్తమ ర్యాంకులను సాధిస్తూ కళాశాలకు మరింత గుర్తింపు తేవాలని కోరినట్లు తెలిపారు. కళాశాల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. రాబోయే ఇంటర్ ఎగ్జామ్స్ లో 100% రిజల్ట్స్ తీసుకురావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సురేందర్ రెడ్డి, అధ్యాపకులు వేణయ్య, సదానందం గౌడు, మల్లేష్, నయూమ్, భీమేష్, రాజేష్, పరశురాం, శ్రీనివాస్, బాలరాజ్, లక్ష్మి కాంత్ లక్ష్మయ్య, సంతోష్ గౌడ్ పాల్గొన్నారు.



# లిటిల్ ఆర్ట్స్ స్కూల్లో ఇన్స్పైర్ ప్రోగ్రాం

**ధర్పల్లి, విశాల భారతి:** ధర్పల్లి మండల కేంద్రంలో లిటిల్ ఆర్ట్స్ పాఠశాలలో మార్చి నెలలో జరగబోయే ఎస్.ఎస్.సి పరీక్షలను దృష్టిలో ఉంచుకొని మండల కేంద్రంలో ఉన్న అన్ని పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థులకు "INSPIRE" "ఇన్స్పైర్" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులైన స్పీకర్స్ విద్యార్థులు పరీక్షలు ఏ విధంగా అధిగమించాలి పరీక్షల సమయంలో ఎటువంటి ప్రణాళిక రచించుకొని దాని అమలుపరచుకోవాలి అని అన్నారు. భవిష్యత్తులో ఎటువంటి ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని వాటిని లక్ష్యాన్ని ఏ విధంగా చేరుకోవాలని విషయాన్ని చక్కగా వివరించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, ఇంపాక్ట్ సర్టిఫైడ్ ట్రైలర్ వ్యక్తిత్వ వికాస నిపుణులు గాజుల సునీల్, లాబిశెట్టి మహేష్, వెంకటేష్ గవర్నమెంట్ కళాశాల ప్రిన్సిపల్ రాజీవ్ దిన్,గణ,లిటిల్ హార్ట్స్ పాఠశాల కరస్పాండెంట్ బి.ఏ. శ్రీకాంత్ , సాధన, స్పందన, ఇతర ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# పోచమ్మ దేవతకు బంగారు బొట్టు బహుకరణ



**భీమదేవరపల్లి, విశాల భారతి:** మండలంలోని కొత్తకొండ గ్రామంలో గల పోచమ్మ దేవతకు బంగారు బొట్టును గ్రామానికి చెందిన నరసింహ చారి బహుకరించారు. బుధవారం కొత్త కొండలో నూతనంగా నిర్మించిన పోచమ్మ దేవాలయంలో 25 వేల విలువ గల బంగారు బొట్టు బిళ్ళను పోచమ్మ తల్లికి కాసుల నరసింహచారి ఝాన్సీరాణి కుమారుడు కాసుల శ్రీకర్ లు గుడిలో పూజ అనంతరం సమర్పించారు. విశ్వబ్రాహ్మణ కులస్తులు ఉప్పుల రాజయ్య, ఉప్పుల కుమారస్వామి, సంపత్, ఎర్రోజు వినయ్, కాసుల అభిలాష్, సుధాకర్,తదితరులు పాల్గొన్నారు.



# విచ్చల విడిగా పశువుల వ్యాపారం

**భద్రాచలం, విశాలభారతి:** చర్ల మండలంలో మూగ జీవాల వ్యాపారం మూడు దున్నలు, ఆరు ఆవులుగా విచ్చలవిడి వ్యాపారం జరుగుతోంది. పేరుకే పశువుల సంత కానీ అక్కడ జరిగే అక్రమ వ్యాపారం ఓ వింతను తలపిస్తుంది. ప్రతిరోజు సుమారు పదుల సంఖ్య లారీలలో వందలాది గోవులను తరలిస్తూ అక్రమంగా లక్షల రూపాయలను గడిస్తున్నారు. ఎవరైనా అడిగితే పాట పాడుకున్నా ఏం చేసుకుంటారో మీ ఇష్టం అనే రీతిలో ఎదురుదాడికి దిగుతున్నారని కొంతమంది వాపోతున్నారు. కొంతమంది పశువుల వ్యాపారులు సిండికేట్ గా ఏర్పడి ఈ అక్రమ పశువుల రవాణాను మాఫియాను తలపించే విధంగా నిర్వహిస్తుండడం గమనార్హం. ఈ వ్యాపారం ప్రతిరోజు రాత్రి 8 గంటల నుండి తెల్లవారుజాము రెండు గంటల వరకు యదేచ్చగా ఎటువంటి అడ్డు అదుపు లేకుండా బహిరంగంగా నిర్వహిస్తున్న సంబంధిత అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. తక్షణమే సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని అక్రమ పశువుల వ్యాపారాన్ని నిలుపుదల చేసి, మూగ జీవాల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని, అక్రమ వ్యాపారం నిర్వహిస్తున్న వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



# రేడియం స్టిక్కర్లు తప్పనిసరి

**అశ్వాపురం, విశాలభారతి :** రోడ్డు ప్రమాదాలను నివారించడంలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఆదేశాల మేరకు మణుగూరు డిఎస్పి రాఘవేంద్రరావు గారి సూచనల మేరకు మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో మంగళవారం అశ్వాపురం పోలీసుల ఆధ్వర్యంలో ట్రాక్టర్ల ముందు భాగం, ట్రక్కుల వెనుక బాగాన రేడియం స్టిక్కర్లు ను అంటించారు. ఈ సందర్భంగా అశ్వాపురం ఎస్ఐ సురేష్ మాట్లాడుతూ ట్రాక్టర్ల యజమానులు డాక్టర్లకు వెనుక నుండి వచ్చే వాహనదారులకు కనిపించే విధంగా రేడియం స్టిక్కర్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మితిమీరిన వేగంతో వాహనాలను నడిపి సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా ప్రవర్తించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘిస్తూ నిర్లక్ష్యంగా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాలను అరికట్టడంలో భాగంగా జిల్లా పోలీసుల తీసుకునే చర్యలకు ప్రజలంతా సహకరించాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.



# చెకుముకి పోస్టర్ ఆవిష్కరణ

**మరిపెడ, విశాలభారతి:** జన విజ్ఞాన వేదిక ప్రతి సంవత్సరం ఉన్నత పాఠశాలల విద్యార్థులకు నిర్వహించే చెకుముకి పరీక్ష గోడ పత్రికను మరిపెడ మండలం ఎమ్మార్వో సైదులు మరియు ఎంపీడీవో ధన్ సింగ్ సీతారాంపురం ఉన్నత పాఠశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులలో పరిశీలన, ప్రశ్న, అధ్యయన, హేతుబద్ధ ఆలోచనలు, పరిశోధనా శక్తి, శాస్త్రీయ దృక్పథం పెంపొందించుకోవడానికి చెకుముకి పరీక్ష నిర్వహించడం హర్షనీయమని అన్నారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక మరిపెడ మండల అధ్యక్షులు బయగాని రామ్మోహన్ మాట్లాడుతూ మండలంలోని ప్రతి పాఠశాలలో 8, 9, 10వ తరగతి విద్యార్థిని విద్యార్థులకు ఈ యొక్క పరీక్షలను నిర్వహిస్తామని చెప్పారు. పాఠశాల స్థాయిలో 19 జనవరి, మండల స్థాయిలో 27 జనవరి, జిల్లా స్థాయిలో 3 ఫిబ్రవరి మరియు రాష్ట్రస్థాయిలో ఫిబ్రవరి 9, 11 తేదీలలో ఈ పోటీ పరీక్షలు జరుగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల గెజిటెడ్ ప్రధాన ఉపాధ్యాయులు రామచంద్రు, జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి లింగంపల్లి దయానంద్, మరిపెడ జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు బయగాని రామ్మోహన్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, చెకుముకి జిల్లా కన్వీనర్ ప్రవీణ్, జీవశాస్త్ర ఆర్పి సునీత తదితరులు పాల్గొన్నారు.



# కళాకారుల సన్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

**ఎస్ ఎస్ కల్చరల్ & స్వచ్ఛంద సేవ సొసైటీ నాయకులు**

**మంచిర్యాల, విశాల భారతి:** మంచిర్యాల జిల్లా ప్రెస్ క్లబ్ లో ఎస్ ఎస్ కల్చరల్ & స్వచ్ఛంద సేవ సంస్థ ఈ నెల 12న కళాకారులకు సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే సన్మాన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేసారు. అనంతరం ప్రెస్ మీట్ నిర్వహించారు. ప్రధాన కార్యదర్శి కోప్పర్తి సురేందర్ మాట్లాడుతూ తెలంగాణ సాధన కోసం ఎన్నో పోరాటాలు చేసిన కళాకారులకు ఎలాంటి గుర్తింపు దొరకలేదు అన్నారు. తెలంగాణ ఉద్యమంలో పోరాడిన కళాకారులకు శుక్రవారం బాయ్స్ హైస్కూల్ గ్రౌండ్ లో ఎస్ ఎస్ కల్చరల్ &స్వచ్ఛంద సేవ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే కళాకారుల సన్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ మహోన్నత కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ,చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి, రామగుండం సి పి రేమ రాజేశ్వరి, మంచిర్యాల జిల్లా కలెక్టర్ బాధవత్ సంతోష్ పాల్గొననున్నారు కాబట్టి జిల్లా లోని సబ్బండ వర్గాల ప్రజలు,కళాకారులు ప్రజా ప్రతినిధులు, ఉద్యోగులు, విద్యార్థులు అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఎస్ కల్చరల్ అండ్ సేవా సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు దుర్గం విజయ్, ప్రధాన కార్యదర్శి కొప్పర్తి సురేందర్, ప్రముఖ సినిమా ఆర్టిస్టు ఆర్ జి వి, ఆర్ ఆర్ జీ, కంపెల్లి శ్రీనివాస్ రచయిత, తిరుపతి వర్మ, సినీ డైరెక్టర్, దుర్గం వినోద్ , కోశాధికారి, తోట మహేష్ ,తదితరులు పాల్గొన్నారు.




# గ్రామీణ స్థాయి నుండి అత్యున్నత స్థాయికి ఎదగాలి

**సీజన్-4 క్రికెట్ పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకరయ్య**

**కొందుర్గు, విశాలభారతి:** మండల కేంద్రంలో కొందుర్గు ప్రీమియర్ లీగ్ సీజన్ 4 క్రికెట్ పోటీలను స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకరయ్య ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ...గ్రామీణ క్రీడాకారుల నైపుణ్యాలను వెలికితీసేందుకు స్థానిక ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు ఎంతగానో అవసరమని అన్నారు .ఈ క్రీడా పోటీలలో పాల్గొంటున్న క్రీడాకారులు తమ తమ పూర్తి స్థాయి నైపుణ్యాలను ప్రదర్శించి అత్యున్నత ప్రతిభ కనబరిచి అత్యున్నత స్థాయిలో ఉండే ప్రీమియర్ లీగ్ పోటీల్లో ప్రవేశించడానికి క్రీడాకారులు అందరూ చక్కని అవకాశంగా ఉపయోగించుకోవాలని టోర్నమెంట్ లో పాల్గొంటున్న జట్లకు శుభాభినందనలు తెలియజేస్తూ క్రీడాకారులు అందరూ క్రీడా స్ఫూర్తితో సీజన్ 4 క్రికెట్ టోర్నమెంట్ లో చక్కటి ప్రదర్శన కనబర్చాలని యువతకు తెలిపారు.ఇంత చక్కటి కార్యక్రమాన్ని గత నాలుగు సీజన్లు గా నిర్వహిస్తున్న ప్రీమియర్ లీగ్ నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో సీజన్ 4 క్రీడా కారులకు డ్రెస్, బ్యాట్లు , స్పాన్సర్ గా వ్యవహరించిన శ్రీ సుబెదా వెంచర్ ఛైర్ పర్సన్ అనిత, స్థానిక సర్పంచ్ కావలి ఆదిలక్ష్మి యాదయ్య,వార్డు సభ్యులు, జెడ్పీటీసీ తనయుడు రామకృష్ణ,ఎంపీటీసీ తనయుడు పోతురాజు గోపాల్ , వైస్ ఎంపీపీ రాజేశ్ పటేల్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు క్రిష్ణా రెడ్డి, గ్రామ అధ్యక్షుడు జి.బి.కృష్ణయ్య,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాములు, రఘు గౌడ్, సింగిల్ విండో ఛైర్మన్ దామోదర్ రెడ్డి ,మాజీ ఎంపిటిసిలు మాజీ సర్పంచ్ మరియు వార్డ్ సభ్యులు, సీనియర్ క్రీడాకారులు మరియు కొందుర్గ్ ప్రీమియర్ లీగ్ ఆర్గనైజేషన్ సభ్యులు కావలి ప్రవీణ్ కుమార్ ,చిన్న రాజు గౌడ్, గుడిసె సచిన్ ,పెరుమల్ల చంద్రశేఖర్, ప్రశాంత్ గౌడ్ ,మహమ్మద్ సైఫ్ ఉల్ల ఖాన్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



# సర్వీస్ లింకేడ్ ప్రమోషన్స్ పత్రాలు అందజేత

**మందమర్రి టౌన్, విశాల భారతి:** మందమర్రి డివిజన్లో అన్ని గనుల డిపార్ట్మెంట్ లలో ఎస్ఎల్పి ప్రమోషన్స్ ఇవ్వడం జరిగిందని ఏఐటీయూసీ మందమర్రి బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ తెలిపారు. బుధవారం మందమర్రి ఏరియా కేకే 5 గని మేనేజర్ తో కలిసి ఏఐటీయూసీ నాయకులు సర్వీస్ లింకేడ్ ప్రమోషన్స్ పొందిన వారికి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కాసిపేట గని విధులు నిర్వహిస్తున్న మైనింగ్ సర్దార్ మచ్చ రమేష్ గనిలో యాక్సిడెంట్ జరిగి ఇటీవల మృతి చెందడం పట్ల ఏఐటీయూసీ నాయకులు మైనింగ్ అధికారులు, కార్మికులు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు. అనంతరం మందమర్రి బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ మాట్లాడుతూ రమేష్ కుటుంబానికి న్యాయం చేస్తామని, వారికి రావలిసిన కంపెనీ బెనిఫిట్స్ అన్ని కూడా త్వరగా వచ్చేలా చేస్తామని, ఒకరికి ఉద్యోగం వచ్చేలా అధికారులతో చర్చించామని, వారికి ఏఐటీయూసీ అండగా ఉంటుందని, ఏఐటీయూసీ ఎప్పుడూ గెలిచినా ఓడినా కార్మికులకు అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ భీమనాదుని సుదర్శన్, బ్రాంచ్ జాయింట్ సెక్రటరీ కంది శ్రీనివాస్, ఆర్గనైజేన్ సెక్రటరీ గాండ్ల సంపత్, ఏరియా నాయకులుబానోత్ నాగేశ్వరావు, మేకల సంతు, ప్రేమ్ లాల్, నరేందర్, దినేష్, జువ్వజి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ లో ఉన్న పనులను పూర్తి చేయాలి



**నాచారం, విశాల భారతి:** జిహెచ్ఎంసి కమిషనర్ రోనార్డ్ రాస్ ని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మర్యాద పూర్వకంగా కలిసారు. అనంతరం ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని పెండింగ్ లో వున్న పనులను త్వరగా పూర్తి చేయాలని కోరారు. అలాగే చర్లపల్లి డివిజన్ లో జరిగిన నాల కెమికల్ బ్లాస్ట్ గురించీ చర్యలు తీసుకోవాలని కోరారు.



# వస్త్రాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**హబ్సిగూడ, విశాల భారతి:** హబ్సిగూడ డివిజన్ స్ట్రీట్ నెంబర్ 8 లో రైమండ్స్ కే ఎన్ ఫ్యాషన్ నూతన వస్త్రాలయా నిర్వాహకులు అశ్విన్ రెడ్డి, సురేష్ గౌడ్ గార్ల ఆహ్వానం మేరకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి , తెలంగాణ రాష్ట్ర బిఆర్ఎస్ సీనియర్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి చేతులమీదుగా జ్యోతి ప్రజ్వలన చేసి పూజ కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం షోరూంను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హబ్సిగూడ డివిజన్ కి చెందిన బిఆర్ఎస్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, సీనియర్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



**మందమర్రి టౌన్, విశాల భారతి:** మందమర్రి పట్టణంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొనగా ఒకరు మృతి చెందారు. బుధవారం మందమర్రి పాత బస్టాండ్ లో బెల్లంపల్లి వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తిని లారీ ఢీకొట్టడంతో మృతదేహం పూర్తిగా నుజ్జు నుజ్జు కాగా వాహనదారుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు మందమర్రి పట్టణంలోని దీపక్ నగర్ కు చెందిన కుంచాల ఆంజనేయులుగా (47) గుర్తించారు. ఇతనికి బార్య, ఇద్దరు అబ్బాయిలు, ఒక అమ్మాయి ఉంది. ఇతను భవననిర్మాణ కార్మిక సంఘంలో కోశాధికారిగా ఉన్నారు. పోస్ట్ మార్టం నిమిత్తం మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని, డ్రైవర్ ను, లారీని అదుపులోకి తీసుకున్నమని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టామని సీఐ మహేందర్ రెడ్డి, ఎస్సై చంద్ర కుమార్ తెలిపారు.



# ప్రభుత్వ నిర్ణయం హర్షనీయం

**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:** స్వాతంత్ర సమరయోధుడు వడ్డె ఓబన్న జయంతి ని తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం వడ్డెర వృత్తిదారుల సంఘం తెలంగాణ రాష్ట్ర కమిటి హర్షం వ్యక్తం చేస్తున్నామని అన్నారు. వడ్డెర వృత్తిదారుల సంఘం తుర్కయాంజాల్ అధ్యక్షులు నర్ర పాండు అధ్యక్షతన సమావేశం బుధవారం నిర్వహించిన్నారు. ఈ ముఖ్య అతిథులుగా వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కుంచం వెంకటకృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లపు విఘ్నేశ్ లు హాజరై మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి నేటికీ 76 సంవత్సరాలు అవుతున్నా వడ్డెర్లను ఏ ప్రభుత్వం గుర్తించిన దాఖలు లేవని సిఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదట మొదటిసారి వడ్డె ఒబన్న జయంతి నిర్వహించడం చాలా గర్వంచతగ్గ విషయం అనిఅన్నారు. వడ్డె ఓబన్న బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా గెరిల్లా పోరాటం చేసిన గొప్ప వ్యక్తి అని వారు. మఖ్యంగా సైరా నర్సింహ్మా రెడ్డికి సర్వసైన్యాధక్ష్యులు ఉండి బ్రిటిష్ వారు విధించిన అధిక పన్నులు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసిన మహానుభావుడు అని అన్నారు. అలాంటి మహనీయునీ జయంతిని అధికారికంగా నిర్వహించడటం పట్ల వడ్డెర వృత్తిదారుల సంఘం హర్షం వ్యక్తం చేస్తున్నామని చెప్పారు. సామాజికంగా ఆర్థికంగా రాజకీయంగా చాలా వెనుకబడి ఉన్నారు అని వారు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డెర ఫెడరేషన్ కు చైర్మన్ నియంచాలని కోరారు. ఎన్నికల లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర సోషల్ మీడియా కన్వనర్ దేరంగుల రామకృష్ణ మాట్లాడుతూ వడ్డెర వృత్తిదారులకు భీమా సౌకర్యం కల్పించి, గుట్టలపై క్వారీలపై పూర్తి హక్కులు కల్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వడ్డెర వృత్తిదారుల సంఘం నాయకులు తన్నీరు సైమన్, గండికోట సత్యం, దేరంగుల బాలకృష్ణ పాల్గొన్నారు.



# ముదిరాజ్ సంఘం అభివృద్ధికి కృషి

**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:** తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి రాగన్నగూడ (ఎన్ ఎస్ ఆర్ నగర్) ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షుడిగా ఢిల్లీ జగదీశ్వర్ ముదిరాజ్, ఉపాధ్యక్షులుగా పళ్ళ వెంకటయ్య, జనరల్ సెక్రెటరీగా ఎడ్ల వెంకటేష్, జాయింట్ సెక్రటరిగా ఖమ్మం రమేష్, కోశాధికారిగా ఎడ్ల దానయ్యను ఎన్నుకున్నారు. ముఖ్య సలహాదారులుగా పిట్టల నరేష్, ఢిల్లీ పాండు ఎన్నికయ్యారు. సభ్యులుగా గోదాసు నరేష్ , కానమని వెంకటేష్ , రెడ్డమోని సాయి కుమార్, చింతకాయల యాదగిరి , ధనమోని నరేష్ , గడిగ యాదగిరి , కోర్ని శివ , పొలమోని సాయికిరణ్ , పుల్లగాజుల నరేష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు ఢిల్లీ జగదీశ్వర్ ముదిరాజ్ మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానని తెలిపారు. తమని ఎన్నుకున్న సంఘ సభ్యులకు ధన్యవాదములు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గోదాసు భద్రయ్య, రెడ్డమోని కోటయ్య, పూజారి నందీశ్వర్, ఢిల్లీ శ్రీనివాస్ , చింతకాయల యాదయ్య, ఢిల్లీ నర్సింహ, ఖమ్మం విఠలేష్ , పొలమోని రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



# ఆచార్య ఎం.గోనానాయక్ కు సత్కారం

**శేరిలింగంపల్లి,విశాలభారతి:** హెచ్ సియు తెలుగు శాఖలో అధ్యాపకులుగా పనిచేస్తున్న ఆచార్య ఎం.గోనానాయక్ ను ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం, భాషాభివృద్ధి ప్రాధికారిక సంస్థ వారు మంగళవారం 'తెలుగు భాషా సేవ జీవిత సాఫల్య పురస్కారం' అందించారు.ఈ సందర్భంగా తెలుగు శాఖ అధ్యాపకులు ఆచార్య ఎం.గోనానాయక్ ని బుధవారం తెలుగు శాఖ అధ్యక్షుల కార్యాలయంలో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు,ఆచార్య పిల్లలమర్రి రాములు,ఆచార్య పవన్ కుమార్,ఆచార్య డి. విజయ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.




# కొత్తూరు మున్సిపాలిటీ లో గంజాయి చాక్లెట్లు

**విశాలభారతి, కొత్తూరు:** గంజాయి చాక్లెట్స్ అమ్ముతున్న ముఠాను అరెస్ట్ చేసినట్లు ఎస్ ఓ టీ పోలీసులు తెలిపారు. షాద్ నగర్ ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ డి. రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని రైతు కాలనీ చౌరస్తా వద్ద ఓ కిరాణా షాపులో గంజాయి చాక్లెట్స్ అమ్ముతున్న ఇద్దరిని పోలీసులు రాత్రి చాకచక్యంగా అరెస్ట్ చేశారు.480 గంజాయి చాక్లెట్స్ ప్యాకెట్లను స్వాధీన పరుచుకొని వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ విచారణలో నందిగామ వద్ద అయ్యప్ప దేవాలయం కిరాణ షాపులో 40 గంజాయి చాక్లెట్స్ ఉన్నాయన్న సమాచారం తెలుసుకొని వాటిని కూడా స్వాధీనపరుచుకున్నారు. కాటేదాన్ నుండి ఈ గంజాయి చాక్లెట్స్ రవాణా అవుతున్నట్లు ఎక్సైజ్ సీఐ రామకృష్ణ తెలిపారు. స్కూల్,, కార్మికులు, రూ 50 నుండి 100 వరకు విక్రయిస్తున్నట్లు సీఐ సీఐ రామకృష్ణ తెలిపారు.



# సృజనాత్మకతను ప్రదర్శించిన గీతం విద్యార్థులు

**పటాన్ చెరు,విశాలభారతి :** విద్యార్థుల సృజనాత్మకత, పరిశోధన, విమర్శనాత్మక ఆలోచనా నైపుణ్యాలను ప్రదర్శించేలా 'పోస్టర్ ఎగ్జిబిషన్'ను బుధవారం గీతం హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ నిర్వహించింది. డిజిటల్ హ్యూమానిటీస్ అంతర్ విభాగ స్వభావాన్ని, సమకాలీన సమాజంలో దాని ఔచిత్యాన్ని ప్రతిబింబించేలా ఈ ప్రదర్శన సాగింది. డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్ లైఫ్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీఏ నాలుగో సెమిస్టర్ విద్యార్థులు తమ పరిశోధనా ప్రాజెక్టులను గోడ పత్రికలుగా రూపొందించి, అందరి ముందు ప్రదర్శించారు. పత్రికలు, డిజిటల్ సమాచారం: సారూప్యం, మార్పు, భవిష్యత్తు; ఇన్స్టాగ్రామ్ ద్వారా వ్యక్తిత్వాల ఆవిష్కరణ: డిజిటల్ ప్రపంచంలో పిల్లల పెంపకం; క్రీడలు, నిరసనలు, మీడియా; కెమెరా వెనుక (భారత చలనచిత్ర పరిశ్రమలో మహిళలు); భవన నమూనాల రూపకల్పన, నిర్మాణాలపై క్షృతికు మేథ ప్రభావం: ఆర్థిక అసమానత ధోరణలు వంటి సలు సమాకాలీన అంశాలపై విద్యార్థులు పరిశోధించి, పోస్టర్ల రూపంలో వాటిని ప్రదర్శించారు. సాంకేతికత, సమాజం, సంస్కృతి విభజనలపై లోతైపై విశ్లేషణ చేశారు. ఆయా ప్రాజెక్టులు విమర్శనాత్మక విశ్లేషణ, సృజనాత్మకత వ్యక్తీకరణకు వేదికగా మారాయి. జీఎహెచ్ఎస్ డైరెక్టర్ సన్నీ గోస్మాన్ జోస్, పలువురు అధ్యాపకులు, తోటి విద్యార్థులు ఈ ప్రదర్శనలో పాల్గొని, పలు సందేహాల గురించి అడిగి నివృత్తి చేసుకున్నారు. వినూత్న ప్రాజెక్టుల ద్వారా విద్యార్థులు తమను తాము అన్వేషించడానికి, ఇతరులకు వ్యక్తీకరించడానికి జీఎస్హెచ్ఎస్ అవకాశం కల్పించింది.





# యశ్వంత్పూర్, చిక్బల్లాపూర్ వ్యవసాయ మార్కెట్లను పరిశీలించిన ఎమ్మెల్యే జిఎంఆర్ బృందం

**పటాన్ చెరు,విశాలభారతి:** రానున్న రోజుల్లో పటాన్చెరు వ్యవసాయ మార్కెట్ ను మోడల్ మార్కెట్ గా తీర్చిదిద్దబోతున్నామని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టడీ టూర్ లో భాగంగా బుధవారం కర్ణాటక రాష్ట్ర రాజధాని బెంగళూరులోని యశ్వంత్పూర్, చిక్బల్లాపూర్ మార్కెట్ యాడలను ఎమ్మెల్యే జిఎంఆర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్ నేతృత్వంలోని బృందం సభ్యులు పరిశీలించారు. అనంతరం ఆయా మార్కెట్ కమిటీల అధికారులతో సమావేశమై క్రయ విక్రయాలు, దుకాణాల కేటాయింపులు, వ్యాపార నిర్మాణ అంశాలపై చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. ఐదు సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన పటాన్ చెరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ అతి కొద్ది కాలంలోనే ఏటా ఆరు కోట్ల టర్నోవర్ స్థాయికి చేరుకోవడం జరిగిందని గుర్తు చేశారు. భవిష్యత్తులో రాష్ట్రంలోనే మోడల్ మార్కెట్ గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# పటాన్ చెరులో కాంగ్రెస్ నేతల సంబరాలు

**పటాన్ చెరు,విశాలభారతి :** కాంగ్రెస్ పాలన నెల రోజులు పూర్తి చేసుకుని, పలు సంక్షేమ పథకాలు అమల్లోకి తీసుకువచ్చిన సందర్భంగా పటాన్ చెరులో కాంగ్రెస్ పార్టీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. మెట్రో ట్రైన్ పటాన్ చెరు వరకు పొడిగిస్తూ తీసుకున్న నిర్ణయం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు స్వీట్లు పంచుకొని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్న ముదిరాజ్, ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షుడు నరసింహా రెడ్డి, నాయకులు సంజీవరెడ్డి, సామయ్య, అడ్వకేట్ రామారావు,. అన్వర్, హాశం, జనంపల్లి కమల్ తదితరులు పాల్గొన్నారు.



# వీరభద్ర స్వామి కల్యాణం రమణీయం

- అంగరంగ వైభవంగా వీరన్న లగ్గం
- పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించిన మంత్రి పొన్నం
- భారీగా హాజరైన భక్తజనం



**భీమదేవరపల్లి,విశాలభారతి:** ఉత్తర తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన వీరభద్ర స్వామి భద్రకాళి అమ్మ వారి కల్యాణం అంగరంగ వైభవంగా బుధవారం జరిగింది. ముందుగా సుంకు కార్యక్రమం నిర్వహించారు. కళ్యాణానికి ఆకాశదేవతలను ఆహ్వానిస్తున్నట్లు నందీశ్వరుని చిత్రపటంను ధ్వజ స్థంభం ముందు ఎగురవేశారు. వీరభద్ర స్వామి భద్రకాళి అమ్మవార్ల ను అలంకరించి ఆలయ కళ్యాణ మండపం లో వేదోతమ్ములైన ఆగమ పండితులచే కళ్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. జై వీరభద్ర స్వామి భాగవనికి జై... అంటూ భక్తులు చేసిన నినాదాలతో ఆలయ ప్రాంగణం మార్మో గింది.కల్యాణాన్ని వీక్షించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు.

**పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి**

వీరభద్ర స్వామి కల్యాణానికి ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలను రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్,సతీమణి మంజుల కలిసి సమర్పించారు. ముందుగా ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఈవో కిషన్ రావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో సన్మానించారు. తీర్థ ప్రసాదాలు అందించారు. అర్చకులు ఈ కళ్యాణం లో ఆలయ ప్రధాన కార్యనిర్వాహణ అధికారి పి కిషన్ రావు, ఆలయ మాజీ చైర్మన్ కొమురవెల్లి చంద్రశేఖర్ గుప్తా, ఆలయ అర్చకులు రాంబాబు, ప్రధాన అర్చకుడు రాజయ్య, శరత్ చంద్ర, ఐలయ్య, సదానందం ,భద్రయ్య, శ్రీకాంత్ ,రమేష్ ,శివకుమార్, శ్రావణ్ కుమార్ ,గురు ప్రసాద్,వినయ్ భక్తులు పాల్గొన్నారు.





# పిఏసిఎస్ చైర్మన్ పై నెగ్గిన అవిశ్వాసం

- రేపు పిఎసిఎస్ చైర్మన్ ఎన్నిక
- భారీ బందోబస్తు ఏర్పాటు చేసిన అధికారులు
- రేపు చైర్మన్ గా రఘుమా రెడ్డి ప్రమాణ స్వీకారం

**చిట్యాల, విశాలభారతి:** చిట్యాల మండలం వెలిమినేడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు రుద్రారపు బిక్షంపై డైరెక్టర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానం లో విజయం సాధించారు. బుధవారం గ్రామంలోని పిఏసిఎస్ కార్యాలయంలో జిల్లా సహకార అధికారి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో అవిశ్వాస తీర్మానం పై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి 11 మంది డైరెక్టర్లు హాజరై అవిశ్వాసానికి అనుకూలంగా ఓటు వేశారు. అనంతరం జిల్లా అధికారి కిరణ్ కుమార్ మాట్లాడుతూ పిఏసిఎస్ చైర్మన్ రుద్రారపు భిక్షం పాలకవర్గాన్ని నిర్వీర్యం చేస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నాడంటూ పలు ఆరోపణలని ప్రస్తావిస్తూ గత నెలలో అవిశ్వాస తీర్మానం పెట్టాలని డైరెక్టర్లు కోరగా తెలంగాణ సహకార సంఘాల చట్టం 1964 ప్రకారం బుదవారం తీర్మాన సమావేశం ఏర్పాటు చేశామని ఈ సమావేశంలో 11 మంది డైరెక్టర్లు అవిశ్వాసానికి అనుకూలంగా ఓటు వేశారని కావున ప్రస్తుత చైర్మన్ భిక్షం అధ్యక్ష పదవి కోల్పోయారని రేపు ఉదయం 11 గంటలకు నూతన చైర్మన్ ని ఎన్నుకోవడం జరుగుతుందని తెలిపారు.

రేపు నూతన చైర్మన్ ఏనుగు రఘుమా రెడ్డి ప్రమాణ స్వీకారం చేయడం జరుగుతుందని సమాచారం. అంతకుముందు గత పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిఐ మహేష్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగింది. డిఎస్పీ(ఎస్.బి) సోమ్ నారాయణ్ సింగ్, డిఎస్పీ విఠల్ రెడ్డి (డిటిసి) లు బందోబస్తు ని పర్యవేక్షించడం జరిగింది. ఈ సమావేశానికి డైరెక్టర్లు బొంతల అంజిరెడ్డి, పిశాటి బీష్మారెడ్డి, ఏనుగు రఘుమా రెడ్డి, గడ్డం సత్తిరెడ్డి, ఎదుల అజిత్ రెడ్డి, మామిడి శ్రీరాములు, టేకుల కవిత,మేడి అచ్చమ్మ, బోయపల్లి స్వామి, గంగాపురం భాస్కర్, మురాల గోపయ్య, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ కార్యాలయాన్నిమూడు నెలలో పూర్తి చేస్తాం

**షాద్ నాగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**విశాల భారతి, కొత్తూరు:** నందిగామ మండల కేంద్ర లోని గత పాలకులు నిర్లక్ష్యానికి గురైన ప్రభుత్వ కార్యాలయని వెంటనే నిర్మాణం పన్ను మొదలు పెట్టి పిల్లల వరకు చేసి నిలిపివేసిన ప్రభుత్వ కార్యాలయాలని భవన పనులు 3 నెలలోనే పూర్తి చేయాల్సిందిగా అధికారులకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆదేశించారు. దినికి రావాల్సిన నిధులు తను ప్రత్యేక చొరవ తీసుకుని నిధులు కేటాయిస్తూ ఇస్తానని అయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో నందిగామ ఎంపీపీ ప్రియాంక శివశంకర్ గౌడ్, రంగారెడ్డి ఎంపీటీసీ సంఘము అధ్యక్షుడు కొమ్ము కృష్ణ, నందిగామ మండేల్ ప్రైసిడెంట్ జంగా నర్సింహా, ఎంపీడీఓ బల్ రెడ్డి,ఎంపీటీసీ చంద్రపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు బాల్ రెడ్డి దార లింగం, కావాలి కృష్ణ, చేగుర్ శ్రీశైలం, మార్క రమేష్, దేపల్లి శ్రీశైలం, మణికం పాల్గొన్నారు..



# భూ వివాదంలో న్యాయం చేయాలి

- బండి రమేష్ ను కలిసిన ప్రకాష్ నగర్ కాలనీ వాసులు
- రౌడీలతో ప్రమాదం ఉందంటూ కాలనీవాసుల ఆవేదన

**విశాలభారతి,కూకట్ పల్లి:** కూకట్పల్లి నియోజకవర్గంలోని బేగంపేట డివిజన్ ప్రకాష్ నగర్ లో 194/ 8/1 లో నీ సర్వే నంబర్ లోపల ఈ భూమి నవాబులకు చెందినది. అక్కడనే కొన్ని ఏళ్లుగా ఇల్లు కట్టుకొని నివాసం ఉంటున్నామని ప్రకాష్ నగర్ కాలనీకి చెందిన స్థానికులు కూకట్పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ దృష్టికి తీసుకువచ్చారు . బుధవారం మియాపూర్ లోని కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి వచ్చి బండి రమేష్ కు మొరపెట్టుకున్నారు. సర్వే నెంబర్ కు ఆనుకొని 184,185, 186, ప్రైవేట్ భూమి ఉందని తెలిపారు, ప్రైవేట్ భూమి పేరుతో తమ భూమిని ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని వివరించారు, భూముల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో తమ ఇళ్ళను కాలి చేయాలని రౌడీలతో బెదిరింపులకు పాల్పడుతూ.. తమను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని బండి రమేష్ దృష్టికి తీసుకువచ్చారు. భూమికి సంబంధించిన పత్రాలను బండి రమేష్ కి అందజేయాగా, స్పందించి జిల్లా ఇన్చార్జి మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు దృష్టికి, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో చర్చించి ప్రకాష్ నగర్ వాసులకు న్యాయం జరిగే విధంగా సహాయశక్తుల కృషి చేస్థాని,సమస్యను పరిష్కరిస్తానని వారికి హామీ ఇచ్చారు. బండి రమేష్ ను కలిసిన వారిలో బేగంపేట్ రమేష్, కొప్పి దినేష్ కుమార్ ,నారాయణ ఉపేందర్, నరసింహ, తో పాటు కాలనీ వాసులు పాల్గొన్నారు.



# డ్రైవర్ లకు నష్టం తెచ్చే (బి ఎన్ ఎస్) 104(2) చట్టం రద్దు చెయ్యాలి

**సీఐటీయూ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్**

**విశాలభారతి,కూకట్ పల్లి:** భారత న్యాయ సంహిత (బి ఎన్ ఎస్) చట్టం ను రద్దు చేయాలని కూకట్ పల్లి సర్కిల్ బాలానగర్ డివిజన్ లోని ఐడిపిఎల్ చౌరస్తాలో సిఐటియు ఆధ్వర్యంలో బుదవారం ట్రక్, ప్రయివేటు బస్సుల డ్రైవర్లు స్వచ్చందంగా బంద్ లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ కేంద్ర ప్రభుత్వం ప్రతి పక్ష పార్టీల ఎంపీలను పార్లమెంట్ నుండి సస్పెండ్ చేసి అడ్డదారిలో డ్రైవర్ లను బతికి ఉండగానే చచ్చినట్లుగా నూతన చట్టం తీసుకొస్తున్నారని, ఈ చట్టం ప్రమాదాలు జరిగినప్పుడు డ్రైవర్లకు 10 ఏండ్లు జైలు శిక్ష,7లక్షల నష్టపరిహారం ఇచ్చేలా భారత న్యాయ సంహిత (బి ఎన్ ఎస్) చట్టం 104 (2) తెచ్చి డ్రైవర్ లు డ్రైవింగ్ ఉద్యోగాలల్లో కి రాకుండా పొట్టే కొట్టే పద్ధతిని కేంద్ర బీజేపీ ప్రభుత్వం చూస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. శిక్ష లతోనే ప్రమాదాలు తప్పుతాయనేది గుడ్డిఆలోచన అన్నారు. మొదటగా కేంద్ర ప్రభుత్వం రోడ్లు గుంతలు లేకుండాచూడాలని అన్నారు. అంతేకాదు ప్రకృతి వైపరీత్యాల వల్ల పొగమంచు ద్వారాకూడా ప్రమాదాలు జరుగుతుంటాయని డ్రైవర్ లను నష్టపరిచే భారత న్యాయ సంహిత చట్టంను రద్దు చేయాలని కేంద్ర బీజేపీ ప్రభుత్వం ను హెచ్చరించారు. రద్దు చేయని పక్షంలో పోరాటాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ట్రాన్స్పోర్ట్ యూనియన్ రాష్ట్ర నాయకులు బసగాని ఉమేష్ రెడ్డి, డ్రైవర్స్ ల నాయకులు విష్ణు, మోసిన్, శేఖర్, నరేష్, సత్యం ముదిరాజ్, భాస్కర్, ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.




# స్ట్రీట్ వెండర్స్ కూల్చివేత..

**6 స్థానికుల ఆగ్రహం**
**కార్పొరేషన్ వద్ద నిరసన**



**మేడిపల్లి,విశాలభారతి:** పిర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 15 వార్డులో నిర్మించిన స్ట్రీట్ వెండర్స్ యొక్క స్టాల్స్ ను బుధవారం మున్సిపల్ సిబ్బంది కూల్చివేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న స్థానికులు కూల్చివేతలపై మండిపడ్డారు అక్రమ నిర్మాణాలు కూల్చామని ఫిర్యాదులు చేస్తే పట్టించుకోని అధికారులు. ప్రభుత్వ సొమ్ముతో నిర్మించి వారే మరల కూల్చివేశారని పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ వద్ద స్థానిక నేతలు స్థానికులు నిరసనకు దిగారు. వీధులలో వ్యాపారాలు చేసుకునే వారి కోసం పిర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ లో నిర్మించిన స్ట్రీట్ వెండర్స్ సంవత్సరాలు గడిచిన ఎవరికి వాటిని కేటాయించలేదు హెచ్ఎండిఏ వాళ్ళది అంటూ గతంలో ఆర్ఐ వాటిని కూల్చడానికి ప్రయత్నం చేయగా స్థానికులు అడ్డుకోవడంతో వెనుకకు తిరిగారు. కమిషనర్ అందుబాటులో లేకపోవడంతో ఒకవైపు పిర్జాదిగూడ మేయర్. కార్పొరేటర్లు గోవా ట్రిప్ లో ఉండగా స్ట్రీట్ వెండర్స్ కూల్చివేతలపై ప్లాన్ ప్రకారం కూల్చివేశారు అంటూ స్థానికులు నాయకులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.



# తోటి డ్రైవర్ కి ఆర్థిక సాయం

**చిట్యాల,విశాలభారతి:** చిట్యాల మండలం చిన్నకాపర్తి గ్రామానికి చెందిన రుద్రారపు వెంకన్న ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొంది ప్రస్తుతం ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న శ్రీరామాంజనేయ లారీ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ సభ్యులు తోటి డ్రైవర్ కు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10వేల నగదును సేకరించారు. ఈ మొత్తం నగదును బుధవారం బాధితుడికి అసోసియేషన్ సభ్యులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు లోడె సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు పాలకూరి రాకేష్, మెట్టు నాగశంకర్, నందిపాటి మహేష్, వీరమల్ల బాలరాజు, లోడే రవితేజ, పాలకూరి రాము, ఆవుల వేణు,మెట్టు నరేష్ తదితరులు పాల్గొన్నారు.



# ఆన్ లైన్ ప్రక్రియ వేగవంతం చేయాలి



- కలెక్టర్ హరిచందన దాసరి
- అభయహస్తం పథకాల ఎంట్రీ ప్రక్రియ పరిశీలన
- ఆన్ లైన్ చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి
- ఎమ్మార్వో కార్యాలయాలలో ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్

**చిట్యాల, విశాలభారతి:** ప్రజల నుంచి తీసుకున్న అభయహస్తం దరఖాస్తుల ఆన్లైన్ ప్రక్రియని వేగవంతం చేయాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి ఐఏఎస్ తెలిపారు. చిట్యాల, నార్కట్ పల్లి తహసీల్దార్ కార్యాలయాలను అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఐఏఎస్ తో కలిసి ఆకస్మిక తనిఖీ చేసి అభయ హస్తం ఆన్ లైన్ ఎంట్రీ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అభయ హస్తం అమలులో భాగంగా ప్రజాపాలన సభల్లో స్వీకరించిన దరఖాస్తులను ఆన్ లైన్ చేసే క్రమంలో దరఖాస్తుదారుల పూర్తి వివరాలను నమోదు చేయాలని అధికారులకు సూచించారు. తప్పులకు ఆస్కారం లేకుండా ఆపరేటర్లు ఒకటికి రెండు సార్లు పరిశీలించి ఎంట్రీ చేయాలన్నారు.ప్రతి దరఖాస్తు కుడి వైపున డేటా ఎంట్రీ ఆపరేటర్ సంతకం చేయాలని సూచించారు. ఏమైనా సందేహాలు ఉంటే వెంటనే అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలన్నారు. తప్పనిసరిగా ఆధార్ నెంబర్ ను ఆన్ లైన్ లో నమోదు చేయాలన్నారు. దరఖాస్తులను డేటా ఎంట్రీ చేస్తున్నప్పుడు ఏమైనా సమస్యలు వస్తున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అందుకు డాటా ఎంట్రీ ఆపరేటర్లు కొన్ని దరఖాస్తుల లో మొబైల్ నెంబర్లు నమోదు చేయలేదని తెలుపగా, సంబంధిత గ్రామపంచాయతీ సెక్రటరీల ద్వారా వారి ఫోన్ నెంబర్లను సేకరించి నమోదు చేస్తున్నట్లు అధికారులు వివరించారు. గ్యారంటీల వారీగా దరఖాస్తులను వేరు వేరు చేసి కంప్యూటరీకరణ చేస్తున్న విధానాన్ని అధికారులు వివరించారు.టీం లీడర్లు విధిగా అభయ హస్తం దరఖాస్తులను దగ్గర ఉండి పర్యవేక్షించి ఎక్కడా తప్పులు దొర్లకుండా పూర్తి చేయాలన్నారు. ఆన్లైన్ డాటా ఎంట్రీ పూర్తయిన దరఖాస్తులను ఎంపీడీఓలు, తహాసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు జాగ్రత్తగా భద్రపర్చాలన్నారు. కార్యక్రమంలో నార్కట్ పల్లి మండల ప్రత్యేక అధికారి మత్స్య శాఖ ఏ.డి.వెంకయ్య,చిట్యాల తహసిల్దార్ దశరథ నాయక్, మున్సిపల్ కమిషనర్ మందడి రామదుర్గారెడ్డి,నార్కట్ పల్లి తహసిల్దార్ పద్మ,ఎంపీడీవో యాదగిరి పాల్గొన్నారు.



# కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తాం

**.బండి రమేష్**

**విశాలభారతి,కూకట్ పల్లి:** కూకట్పల్లి నియోజకవర్గ ఇంద్రాగాంధీ పురం కాలనీ ఎన్నికల లో గెలుపొందిన సందర్భంగా విజయం సాధించిన నూతన అధ్యక్షుడు సయ్యద్ యూసుఫ్ కుకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ ను మియాపూర్ లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు . బండి రమేష్ యూసుఫ్ ని అభినందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం హాయంలో మరింత అభివృద్ధి చెందే విధంగా చూడాలని....కాలనీ సమస్యలు తన దృష్టికి తీసుకువస్తే అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని బండి రమేష్ హామీ ఇచ్చారు.పార్టీని మరింత బలోపేతం చేయాలని ఈ సందర్భంగా సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రతి పేదవాడికి అందే విధంగా చూడాలని తెలిపారు. ఇందిరాగాంధీ పురం చెందిన మహమ్మద్ గౌస్ కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానం,తెలిపి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు, ఈ కార్యక్రమంలో నవాబు, వాసిముద్దీన్, పప్పు ,ఎమ్ము, ఇజాజ్, రవాజ్ , తదితరులు పాల్గొన్నారు..



# కూకట్ పల్లి జోనల్ కమీషనర్ గా అభిలాష అభినవ్ నియామకం

**జోనల్ కమీషనర్ ను మర్యాద పూర్వకంగా కలిసిన పట్లోళ్ల నాగిరెడ్డి**

**విశాలభారతి,కూకట్ పల్లి:** నూతనంగా కూకట్ పల్లి జోనల్ కమీషనర్ గా బాధ్యతలు చేపట్టిన అభిలాష అభినవ్ ను కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ ఎ బ్లాక్ అధ్యక్షులు పట్లోళ్ల నాగిరెడ్డి బుదవారం ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గ సమస్యలపై నియోజకవర్గం అభివృద్ధి కొరకు తమ వంతు సహకారంగా పనిచేస్తామని తెలిపారు. మూసాపేట్ డివిజన్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాచమల్ల శేఖర్ గౌడ్, డిసిసి కార్యదర్శి ఎ.వెంకటరెడ్డి, భరత్ నగర్ కాలనీ కాంగ్రెస్ అధ్యక్షులు అశోక్ ముదిరాజ్, నాయకులు సురేష్ రెడ్డి పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
సినిమా
www.vishalabharati.com
epaper:vishalabharati.com
7
గురువారం,
11.01.2024
హైదరాబాద్
vishalabharathi Telugu Daily

# గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్‌కి 'నేను' కాపీ అందజేసిన పద్మశ్రీ బ్రహ్మానందం!



గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్‌ని పద్మశ్రీ బ్రహ్మానందం మర్యాదపూర్వకంగా కలిశారు. బ్రహ్మానందం జీవితంలోని అత్యంత ఆసక్తికరమైన అంశాలతో, అనుభవాలతో ప్రచురితమైంది 'నేను'. బ్రహ్మానందం ఆటోబయోగ్రఫీగా విడుదలైన నేను పుస్తకానికి బ్రహ్మానందం అభిమానుల్లోనూ, సినిమా ఇండస్ట్రీలోనే కాకుండా, పుస్తక ప్రియుల్లోనూ మంచి ఆదరణ లభిస్తోంది. నేను ఆటోబయోగ్రఫీ గురించి ఇటీవల మెగా స్టార్ చిరంజీవి కూడా మనసారా అభినందించారు. బ్రహ్మానందం కృషిని ప్రశంసించారు. తాజాగా గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్‌కి తన ఆటోబయోగ్రఫీ నేనును బహూకరించారు పద్మశ్రీ బ్రహ్మానందం. నేను పుస్తకాన్ని అందుకున్న రామ్‌చరణ్ ఆనందాన్ని వ్యక్తం చేశారు. బ్రహ్మానందంగారు తమ జీవితంలోని అనుభవాలతో నేను' రాశారు. అత్యద్భుతమైన ఆయన జీవిత ప్రయాణాన్ని ఇందులో సంక్షిప్తం చేశారు. అక్కడక్కడా చమత్కారంతో, మనసులోని ఎన్నెన్నో విషయాలను ఇందులో రాసుకున్నారు. ఓ వైపు జీవిత పాఠాలను నేర్పుతూ, అనుభవాలను పంచుకుంటూ, అక్కడక్కడా నవ్విస్తూ, ఎన్నో సినిమాల సంగతులను గుర్తుచేస్తూ, ఆద్యంతం అద్భుతంగా సాగింది ఈ పుస్తకం. బ్రహ్మానందంగారు రాసిన ఆటోబయోగ్రఫీ 'నేను' అందరికీ అందుబాటులో ఉంది. ప్రతి ఒక్కరూ చదవదగ్గ పుస్తకం ఇది అని ట్వీట్ చేశారు గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్.

## జనవరి 20న అల్లు స్నేహ రెడ్డి పికాబు ప్రెసెంట్ ఫైర్ ఫ్లై కార్నివాల్

వ్యాపార రంగాల్లో ఎప్పుడూ ముందుండే అల్లు కుటుంబం నుంచి అల్లు స్నేహారెడ్డి స్థాపించిన పికాబు సంస్థ సమర్పిస్తున్న ఫైర్ ఫ్లై కార్నివల్ని జనవరి 20న ఎన్కన్వెన్షన్ లో నిర్వహించడం జరుగుతుంది. ఈ ఫ్యామిలీ కార్నివాల్ గ్రాండ్గా చేయడం కోసం పికాబు సంస్థ టాప్ స్టిచ్ సంస్థతో జతకట్టింది. ఈ కార్నివాల్ లో షాపింగ్ ఎంజాయ్మెంట్ ఆక్టివిటీస్ రుచికరమైన వంటకాలు మరియు లైవ్ మ్యూజిక్ తో ఆకట్టుకునే విధంగా ఏర్పాటు చేశారు. ఈ ఈవెంట్ ఈ నెల 20న ఎన్ కన్వెన్షన్ మాదాపూర్ లో ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుంది.



## ది గోట్ లైఫ్" (ఆడు జీవితం) ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్



మలయాళ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ నటిస్తున్న కొత్త సినిమా "ది గోట్ లైఫ్" (ఆడు జీవితం). హాలీవుడ్ యాక్టర్ జిమ్మీ జీన్ లూయిస్, అమలాపాల్, కేఆర్ గోకుల్, అరబ్ ఫేమస్ యాక్టర్స్ తాలిబ్ అల్ బలూషి, రిక్ అబే ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. బెన్యామిన్ రాసిన గోట్ డేస్ నవల ఆధారంగా ఈ సినిమాను అవార్డ్ విన్నింగ్ డైరెక్టర్ బ్లెస్సీ రూపొందించారు. విజువల్ రొమాన్స్ బ్యానర్ "ది గోట్ లైఫ్" (ఆడు జీవితం) సినిమాను మలయాళ చిత్ర పరిశ్రమలో ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ గా భారీ బడ్జెట్ తో నిర్మించింది. ఏప్రిల్ 10న "ది గోట్ లైఫ్" (ఆడు జీవితం) సినిమా పాన్ ఇండియా స్థాయిలో మలయాళంతో పాటు హిందీ, తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో రిలీజ్ కానుంది. ఇవాళ ఈ సినిమా నుంచి పృథ్వీరాజ్ సుకుమారన్ ఫస్ట్ లుక్ పోస్టర్ ను పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ రిలీజ్ చేశారు. తన స్నేహితుడు పృథ్వీరాజ్ సుకుమారన్ కు, "ది గోట్ లైఫ్" (ఆడు జీవితం) మూవీ టీమ్ కు ప్రభాస్ తన బెస్ట్ విశెస్ తెలియజేశారు. ఈ సందర్భంగా పృథ్వీరాజ్ సుకుమారన్ మాట్లాడుతూ నా ఫ్రెండ్ ప్రభాస్ చేతుల మీదుగా "ది గోట్ లైఫ్" (ఆడు జీవితం) ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేసుకోవడం హ్యాపీగా ఉంది. ఈ ప్రాజెక్ట్ ఒప్పుకున్నప్పుడే ఈ సినిమా కోసం ఎంత కష్టపడాల్సి వస్తుంది అనేది నాకు తెలుసు. ఐదేళ్లు "ది గోట్ లైఫ్" (ఆడు జీవితం) సినిమా కోసం కేటాయించాను. మానసికంగా, శారీరకంగా నజీబ్ క్యారెక్టర్ లా మారిపోయాను. ఎన్నో సవాళ్లు ఎదుర్కొని ఈ మూవీ కోసం రాజీ లేకుండా కష్టపడ్డాను. "ది గోట్ లైఫ్" (ఆడు జీవితం) సినిమాకు పనిచేస్తున్నప్పుడు మేము ఎంతగా ఎంజాయ్ చేశామో, రేపు థియేటర్స్ లోనూ ప్రేక్షకులు కూడా అంతే హ్యాపీగా ఫీలవుతారు. అని చెప్పారు.

## హను-మాన్‌లో అంజమ్మ పాత్ర నా కెరీర్ లో డిఫరెంట్ రోల్ అవుతుంది



క్రియేటివ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ నుంచి వస్తున్న ఫస్ట్ ఇండియన్ ఒరిజినల్ సూపర్ హీరో మూవీ 'హను-మాన్'. తేజ సజ్జ కథానాయకుడిగా నటించిన ఈ మాగ్నమ్ ఓపస్ టీజర్, పాటలు, ట్రైలర్ ట్రెమండస్ రెస్పాన్స్ తో గ్లోబల్ లెవల్ లో క్రేజ్ సంపాదించుకుంది. ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్‌పై కె నిరంజన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, శ్రీమతి చైతన్య సమర్పిస్తున్నారు. హను-మాన్ సంక్రాంతి కానుకగా జనవరి 12 ప్రపంచవ్యాప్తంగా చాలా గ్రాండ్ గా విడుదలౌతుంది. ఈ నేపథ్యంలో హను-మాన్ లో కీలక పాత్ర పోషించిన ప్రముఖ నటి వరలక్ష్మి శరత్‌కుమార్ విలేకరుల సమావేశంలో చిత్ర విశేషాలని పంచుకున్నారు. ప్రశాంత్ వర్మ గారు ఈ కథ చెప్పినపుడు చాలా నచ్చింది. తప్పకుండా చేయాలనే ఫీలింగ్ కలిగింది. ఇందులో తేజకి అక్క పాత్రలో కనిపిస్తాను. బ్రదర్, సిస్టర్ మధ్య వుండే సరదా సన్నివేశాలు మంచి వినోదాన్ని పంచుతాయి. చాలా క్యూట్ గా వుంటాయి. ప్రేక్షకులు చాలా బాగా కనెక్ట్ అవుతారు. ఇది సూపర్ హీరో ఫిల్మ్. ఇందులో తేజ సూపర్ హీరో. నేను కూడా ఒక యాక్షన్ సీక్వెన్స్ చేశాను. అది ట్రైలర్ లో చూసే వుంటారు. ఒక మాస్ హీరోకి ఉన్నంత ఎలివేషన్ వుండే యాక్షన్ సీక్వెన్స్ అది. సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. దర్శకుడు ఎంత అద్భుతంగా కథ చెప్పారో అంత అద్భుతంగా సినిమా తీశారు. ఇంతింతై వటుడింతై అన్నట్టుగా ఈ చిత్రం ఇంత పెద్ద స్కేల్ లో గ్రాండ్ గా రావడం చాలా ఆనందంగా వుంది. ఆడియన్స్ నుంచి చాలా పాజిటివ్ ఎనర్జీ వస్తోంది. తేజ, ప్రశాంత్, నిర్మాత ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డారు. తప్పకుండా ఈ చిత్రం అద్భుతంగా అలరిస్తుందని ఆశిస్తున్నాను. -ప్రశాంత్ చాలా ఫోకస్ గా వుంటారు. తనకేం కావాలో పూర్తి క్లారిటీ తనలో వుంటుంది. తేజ, ప్రశాంత్ మధ్య మంచి సింక్ వుంది. పైగా ప్రశాంత్ ఒక్క టేక్ లో ఓకే చెప్పే డైరెక్టర్ కాదు (నవ్వుతూ) తను అనుకున్నది వచ్చే వరకూ రాజీపడరు. అయితే ఏదైనా బెటర్ మెంట్ కి ఉపయోగపడుతుందంటే ఇన్ పుట్ తీసుకుంటారు. నిర్మాత నిరంజన్ రెడ్డి గారికి హ్యాట్సప్ చెప్పాలి. హను మాన్ ని చాలా అద్భుతంగా నిర్మించారు. దర్శకుడి విజన్ ని అర్థం చేసుకునే నిర్మాత నిరంజన్ గారు. -ప్రేక్షకులు ఖచ్చితంగా ఇష్టపడతారు. నేను ఒక సినిమా చేస్తున్నానంటే అందులో ఏదో కొత్తదనం వుటుందనే పేరు వచ్చింది. ఆ పేరుని కాపాడుకోవడానికి ప్రయత్నిస్తాను. హను-మాన్ లో చేస్తున్న అంజమ్మ పాత్ర కూడా భిన్నంగా వుంటుంది.

## మెకానిక్ ఆడియో సక్సెస్ మీట్



టీనాశ్రీ క్రియేషన్స్ బ్యానర్‌పై మణిసాయితేజరేఖ నిరోషా జంటగా నటించిన చిత్రం 'మెకానిక్'. ముని సహేకర దర్శకత్వం వహించడంతో పాటు కథ, స్క్రీన్‌ప్లే, డైలాగ్స్, పాటలు కూడా రాశారు. ఎం. నాగ మునెయ్య (మున్నా) నిర్మాత. నందిపాటి శ్రీధర్‌రెడ్డి, కొండ్రాసి ఉపేందర్ సహ నిర్మాతలు. ఈనెల 26న విడుదల కానున్న ఈ చిత్రం ఆడియో సూపర్‌హిట్ అయింది. టి `సిరీస్ ద్వారా విడుదలైన ఆడియో 10 మిలియన్‌లకు దగ్గరగా వెళ్లి రికార్డు సృష్టిస్తోంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ ఆడియో సక్సెస్‌మీట్‌ను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ రచయిత లక్ష్మి భూపాల, నిర్మాతల మండలి సెక్రటరీ ప్రసన్నకుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నిర్మాత మున్నా మాట్లాడుతూ... సినిమాలంటే నాకున్న ప్యాషన్ ఇక్కడిదాకా తీసుకొచ్చింది. నెలకు లక్ష రూపాయల జీతం వచ్చే ఉద్యోగాన్ని కూడా వదిలిపెట్టి ఈ సినిమా నిర్మాణాన్ని చేపట్టాను. అది రిస్క్ అని నాకూ తెలుసు. కానీ ఇప్పుడు మా సినిమా ఆడియో టి `సిరీస్ వంటి ప్రఖ్యాత సంస్థ తీసుకోవడం, వారి చార్ట్‌బస్టర్‌లో మా 'మెకానిక్' ఆడియో దూసుకు పోవడంతో ఆ రిస్క్‌కు తగిన ఫలితం దక్కింది అనిపిస్తోంది. మా సహ నిర్మాతలు నందిపాటి శ్రీధర్‌రెడ్డి, కొండరాశి ఉపేందర్‌ల సహకారం వల్లనే మంచి సినిమా నిర్మించగలిగాను. వారికి నా థ్యాంక్స్. ఇక దర్శకుడు ముని సహేకర గారి టాలెంట్ గురించి చెప్పాలంటే నా స్థాయి సరిపోదు అనిపించింది. మల్టీ టాలెంటెడ్. మంచి పర్‌ఫెక్షన్, విజన్ ఉన్న దర్శకుడు, రచయిత. మొత్తం పాటలు ఆయనే రాశారు. హీరో మణిసాయితేజ` రేఖ నిరోషా జంట అందరినీ అలరిస్తుంది. ముఖ్యంగా సంగీత దర్శకుడు వినోద్ యాజమాన్య గారికి ఎప్పటికీ రుణపడి ఉంటాము. ఆయన సంగీతం వల్లే విడుదలకు ముందే మా సినిమా టాక్ ఆఫ్ ఇండస్ట్రీ అయ్యింది అన్నారు...

## ఫిబ్రవరి 9న 'ఊరు పేరు భైరవకోన'



హీరో సందీప్ కిషన్, ట్యాలెంటెడ్ డైరెక్టర్ విఐ ఆనంద్ ల మోస్ట్ అవైటెడ్ ఫాంటసీ అడ్వెంచర్ 'ఊరు పేరు భైరవకోన'. హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా నిర్మిస్తుండగా, ఎకె ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై అనిల్ సుంకర సగర్వంగా సమర్పిస్తున్నారు. బాలాజీ గుత్తా ఈ చిత్రానికి సహ నిర్మాత. ఊరు పేరు భైరవకోన రిలీజ్ డేట్ కి సంబంధించిన అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 9న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ గా విడుదల చేస్తున్నట్లు అనౌన్స్ చేశారు. సందీప్ కిషన్ మంత్రదండం పట్టుకుని కనిపించిన రిలీజ్ డేట్ పోస్టర్ చాలా క్యూరియాసిటీని పెంచింది. ఊరు పేరు భైరవకోనలో సూపర్ నేచురల్ ఎలిమెంట్స్ వుండబోతుంది. టీజర్ సినిమా ప్రిమైజ్ ని అద్భుతంగా ప్రజెంట్ చేసింది. ఈ చిత్రానికి శేఖర్ చంద్ర సంగీతం అందించారు. మొదటి రెండు పాటలు నిజమే నే చెబుతున్నా, హమ్మా హమ్మా ఇప్పటికే చార్ట్‌బస్టర్‌గా నిలిచాయి.

## కన్యాకుమారి టీజర్ రిలీజ్

ఆనంద్ దేవరకొండ హీరోగా "పుష్పక విమానం" సినిమా రూపొందించి ప్రతిభ గల దర్శకుడిగా పేరు తెచ్చుకున్నారు దామోదర. ఆయన ప్రస్తుతం రాడికల్ పిక్చర్స్ బ్యానర్ పై దర్శక నిర్మాతగా "కన్యాకుమారి" సినిమాను తెరకెక్కిస్తున్నారు. గీత్ సైని, శ్రీచరణ్ రాచకొండ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న ఈ సినిమా షూటింగ్ కంప్లీట్ చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటోంది. "కన్యాకుమారి" టీజర్ ను హీరో విజయ్ దేవరకొండ రిలీజ్ చేశారు. టీజర్ చాలా బాగుందని ప్రశంసించిన విజయ్ దేవరకొండ, "కన్యాకుమారి" మూవీ టీమ్ కు తన బెస్ట్ విశెస్ తెలియజేశారు. తను అనుకున్న విషయాన్ని మొహం మీదే చెప్పేసే శ్రీకాకుళం అమ్మాయి కన్యాకుమారి. పెళ్లి చూపులకు వచ్చిన అబ్బాయిని 'నీది విగ్గు కదా..! అని అడిగే బెరుకులేని యువతి. కన్యాకుమారి అందానికి ఊర్లో అబ్బాయిలు వెంటపడితే చెంప చెళ్లుమనిపిస్తుంటుంది. ఈ పిల్లకు పొగరు అని అనుకున్నా పట్టించుకోదు. కన్యాకుమారి డిగ్రీ చదివినా...చీరల కొట్టులో పని చేయాల్సివస్తుంది. కన్యాకుమారి క్యారెక్టర్ లో గీత్ సైని పర్ ఫార్మెన్స్ ఎనర్జిటిక్ గా ఉంది. శ్రీచరణ్ రాచకొండకు కూడా మంచి డెబ్యూ మూవీ కానుంది. ఒక యూనిక్ కాన్సెప్ట్ తో "పుష్పక విమానం" సినిమాను రూపొందించిన దర్శకుడు దామోదర తన సెకండ్ ప్రాజెక్ట్ తో మంచి విలేజ్ బ్యాక్ డ్రాప్ ఎంటర్ టైనర్ ను తెరకెక్కించినట్లు టీజర్ తో తెలుస్తోంది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తయ్యాక "కన్యాకుమారి" సినిమా రిలీజ్ డేట్ ను మూవీ టీమ్ అనౌన్స్ చేయనున్నారు.



Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.